బుధవారం
07-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 226
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అజిత్ వర్గమే అసలైన ఎన్‌సీపీ: ఈసీ

ఢిల్లీ: అజిత్ పవార్ వర్గాన్నే అసలైన ఎన్‌సీపీగా గుర్తిస్తున్నట్టు ఈసీ మంగళవారం ప్రకటించింది. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) ఎవరిదనే విషయంలో కొంతకాలంగా ఆ పార్టీ చీలిక వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో అసెంబ్లీలో ఎక్కువ మంది ఎమ్మెల్యేలు కలిగిన అజిత్ పవార్ వర్గమే పార్టీ చిహ్నం, ఎన్నికల గుర్తును దక్కించుకుంది. త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తన వర్గానికి ఒక పేరును ఎంచుకోవాలని శరద్ పవార్‌కు ఈసీ సూచించింది. ఫిబ్రవరి 7న మధ్యాహ్నం 3 గంటల లోపు తమ వర్గం పేరు, గుర్తును ఎన్నికల సంఘానికి తెలియజేయాలని గడువు ఇచ్చింది. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న వేళ ఈసీ నిర్ణయం వెలువడింది.

చలో అసెంబ్లీ

ఉద్రిక్తం

- పోలీసుల వలయాన్ని ఛేదించి వెలగపూడి చేరిన సర్పంచ్‌లు
- అరెస్ట్ చేసి తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలింపు

2లో

వైసీపీలో రాజ్యసభ గుబులు

- కలవరపెడుతున్న అసంతృప్తుల వ్యవహారం
- క్రాస్ ఓటింగ్ జరగవచ్చని అనుమానం
- మాక్ పోలింగ్‌కు యోచన

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికల వ్యవహారం అధికార వైసీపీలో గుబులు రేపుతోంది. మూడు రాజ్యసభ స్థానాలను గెలుచుకునేందుకు అవసరమైన ఎమ్మెల్యేల బలం ఉన్నప్పటికీ క్రాస్ ఓటింగ్ జరుగుతుందని కలవరం చెందుతోంది. ఎమ్మెల్యేల సంఖ్యాపరంగా చూస్తే... మూడు రాజ్యసభ స్థానాలను వైసీపీ కైవసం చేసుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అయితే వైసీపీ ఇన్‌చార్జిల, మార్పులు చేర్పులతో టికెట్లు దక్కని వారు, ఇంతకు ముందే పార్టీని వీడినవారు, ఇతరత్రా కారణాలతో మరికొంతమంది దాదాపు 25 మందికిపైగా పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారు. ఇది గమనించిన టీడీపీ వ్యూహాత్మకంగా ఒక స్థానానికి తమ పార్టీ నుంచి అభ్యర్థిని పోటీ పెట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలో రాజ్యసభకు పోటీ చేసే అంశంపై చర్చించినట్లు తెలిసింది. కాగా పోటీపై టీడీపీ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఏప్రిల్ 3వ తేదీన రాష్ట్రానికి చెందిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(వైసీపీ), కనకమేడల రవీంద్ర కుమార్ (టీడీపీ), సీఎం రమేశ్ (బీజేపీ) పదవీ కాలం ముగియనుంది. ఆయా ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రస్తుతమున్న సంఖ్యా బలం ఆధారంగా ఒక్కో రాజ్యసభ స్థానానికి 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరముంది. దీని ఆధారంగా వైసీపీ మూడు స్థానాలు దక్కించుకునేందుకుగాను 132 ఎమ్మెల్యేలు కావాలి. టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామాను ఆమోదించారు. పార్టీ ఫిరాయింపులపై అందిన ఫిర్యాదుల మేరకు టీడీపీ, వైసీపీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలకు స్పీకర్ తమ్మినేని సీతారామ్ నోటీసులు జారీజేశారు. వారందరిపైన అనర్హత వేటు వేస్తే, వారు రాజ్యసభ ఎన్నికల్లో ఓట్లు వేసే అర్హతను కోల్పోతారు. దీంతో రాజ్యసభ స్థానాల ఓటింగ్‌కు మొత్తం ఎమ్మెల్యేల సంఖ్యాబలం తగ్గుతుంది. ఈనెల 8వ తేదీన రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీచేయనున్నారు. నామినేషన్ దాఖలకు ఈనెల 15వరకు గడువు ఉంటుంది. ఈనెల 27న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు. ఇప్పటికే మూడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను బరిలో దించుతామని వైసీపీ ప్రకటించింది. ఈలోగా తమ ఎమ్మెల్యేలతో మాక్ పోలింగ్ పెట్టే ఆలోచనలో వైసీపీ అధిష్ఠానం ఉంది.

నిత్యావసర ధరల పెరుగుదలపై

దద్దరిల్లిన అసెంబ్లీ

- సభ లోపలా, బయటా ప్రతిపక్ష సభ్యుల ఆందోళన
- స్పీకర్ పోడియం చుట్టుముట్టి చర్చకు పట్టు
- టీడీపీ సభ్యుల సస్పెన్షన్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు దద్దరిల్లాయి. వాడివేడిగా కొనసాగుతున్నాయి. తొలిరోజు గవర్నర్ ప్రసంగంపై తీవ్ర విమర్శలు గుప్పించిన ప్రతిపక్ష సభ్యులు రెండో రోజు మంగళవారం నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై సభ లోపలా, బయటా ఆందోళన చేపట్టారు. ధరలను అరికట్టడంలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ప్ల కార్డులతో శాసనసభకు హాజరయిన తెలుగుదేశం పార్టీ సభ్యులు సమావేశం ప్రారంభమైన వెంటనే నిత్యావసర వస్తువుల ధరలపై స్పీకర్ తమ్మినేని సీతారామ్‌కు వాయిదా తీర్మానం ఇచ్చారు. దానిని స్పీకర్ వెంటనే తిరస్కరిస్తూ సభా కార్యక్రమాలను ప్రారంభించడంతో వాయిదా తీర్మానంపై చర్చను చేపట్టాలని డిమాండ్ చేస్తూ టీడీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. పెరిగిన ధరలతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, ఈ అంశంపై చర్చించాల్సిందేనని పట్టుపట్టారు. ఆకాశాన్నంటిన నిత్యావసర వస్తువుల ధరలు, మరోపక్క పన్నుల భారాలు, ఇంకోవైపు విద్యుత్, ఆర్టీసీ తదితర చార్జీల పెంపుతో సామాన్యుడు విలవిల లాడుతున్నాడని, శాసనసభలో ఇంతకంటే చర్చించడానికి ముఖ్యమైన అంశం ఏముంటుందంటూ స్పీకర్‌ను వారు నిలదీశారు. స్పీకర్ వారి ఆందోళనలను పట్టించుకోకుండా టీడీపీ సభ్యుల నినాదాల మధ్యే మంత్రులు కొన్ని బిల్లులను ప్రవేశ పెట్టారు. దీంతో టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియం వైపు దూసుకుపోయారు. పోడియం

- మిగతా 2 లో

ఎస్సీ వర్గీకరణపై విచారణకు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం

సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వం

న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై సుప్రీం కోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. దీనిపై విచారణ జరపడానికి చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేశారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లకు సంబంధించి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలలో ఉపకులాల వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందా లేదా అనే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తోంది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌కు ఇతర పిటిషన్లను ధర్మాసనం జత చేసింది. అన్ని పిటిషన్లు ఒకేసారి విచారిస్తామని స్పష్టంచేసింది. ఎస్సీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ...అందులోనూ వాల్మీకి, మజాబీ సిక్కులకు ప్రాధాన్యత ఇస్తూ పంజాబ్ ప్రభుత్వం తీసుకొచ్చిన షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతుల(రిజర్వేషన్స్ ఇన్ సర్వీస్) చట్టం 2006కు చట్టబద్ధతను రాజ్యాంగ ధర్మాసనం పరిశీలిస్తోంది. సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనంలో న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, విక్రమ్‌నాథ్, బేలా ఎం త్రివేది, పంకజ్ మిత్తల్, మనోజ్ మిశ్రా, సతీశ్‌చంద్ర మిశ్రా సభ్యులుగా ఉన్నారు. పంజాబ్, హరియాణా హైకోర్టు తీర్పును

- మిగతా 2 లో

అప్పు ఏడు లక్షల కోట్లే

- ప్రతిపక్షాలది దుష్ప్రచారం మాత్రమే
- టీడీపీ హయాంలోనే రుణాలెక్కువ
- చంద్రబాబు మేనిఫెస్టో ఓ మాయాజాలం
- విభజన వల్ల చాలా నష్టపోయాం
- అయినా సుపరిపాలన అందించాం
- ఏపీ అసెంబ్లీలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ అప్పు మొత్తం కలిపి రూ.7 లక్షల కోట్లేనని, వాస్తవాలు తెలుసుకోకుండా ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మంగళవారం సీఎం జగన్ మాట్లాడారు. 'ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చాం. విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచాం. దాదాపు రూ.2 లక్షల 55 వేల కోట్లు పేదలకు నేరుగా అందజేశాం. ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే మా తాపత్రయం. ఆ ప్రయత్నంలో భాగంగానే ఇంటింటి ఆర్థిక స్థితిని మార్చాం' అని సీఎం వివరించారు. 'చంద్రబాబు ఏనాడూ మంచి చేసింది లేదు. అయినా కేంద్రం కంటే రెట్టింపు స్థాయిలో బాబు అప్పులు తెచ్చాడు. కానీ మనమే ఎక్కువ అప్పులు చేశామని అబద్ధాల బ్యాచ్ ప్రచారం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం 6.5 శాతం అప్పులు చేస్తే...రాష్ట్ర ప్రభుత్వం 5.2 శాతం మాత్రమే చేసింది. ఏ రకంగా చూసినా గత ప్రభుత్వానికి, మనకూ ఎంత వ్యత్యాసముందో చెప్పేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుంది. విభజన నాటికి రూ.లక్షా 53 వేల కోట్ల అప్పు ఉంటే... చంద్రబాబు దిగిపోయే నాటికి రూ.4.12 లక్షల కోట్లకు చేరింది. ఇప్పుడది ఏడు లక్షల కోట్ల పై చిలుకుగా ఉంది. మన హయాంలో ఆర్థికసంఘం సిఫారసుల కంటే కూడా రూ.366 కోట్లు తక్కువ తీసుకున్నాం. చంద్రబాబు హయాంలో రూ. 15,227 కోట్లు సగటున ఖర్చు చేస్తే... మన హయాంలో రూ.17,757 కోట్లు ఖర్చు చేశాం. రూ.2 లక్షల 55 వేల కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. ఇవిగాక నాన్ డీబీటీ ద్వారా రూ.లక్షా 76 వేల కోట్లు అందించాం' అని సీఎం వెల్లడించారు. 'ఈ వాస్తవాలను పక్కనబెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇప్పుడు మరలా కొత్త మేనిఫెస్టోలో ప్రజల్లోకి వెళ్లి వారిని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రూ.70 వేల కోట్లకే రాష్ట్రం శ్రీలంక అవుతుందని అంటున్న చంద్రబాబు...రూ.1.26 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి' అని జగన్ ప్రశ్నించారు. అదేమంటే సంపద సృష్టిస్తానని చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. పద్నాలుగేళ్లు సీఎంగా

- మిగతా 2 లో

నేడు ఢిల్లీకి చంద్రబాబు

- బీజేపీ అగ్రనేతలతో భేటీ
- ఎన్నికల పొత్తుపై చర్చించే అవకాశం



విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు బుధవారం ఢిల్లీ పర్యటన ఖరారైనట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. బుధవారం రాత్రి అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లనున్న చంద్రబాబు... బీజేపీ జాతీయ నేతలతో విడివిడిగా సమావేశం కానున్నట్టు తెలుస్తోంది. చంద్రబాబు ఢిల్లీ టూర్ అంశం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. టీడీపీ, జనసేన మధ్య సీట్ల సర్దుబాటుపై ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చిన చంద్రబాబు... ఏ పార్టీకి ఎన్ని సీట్లు, పోటీ చేసే అభ్యర్థుల జాబితా విషయంలో స్పష్టత రాలేదు. బీజేపీతో పొత్తు వల్ల నష్టం జరుగుతుందని టీడీపీ శ్రేణులు భావిస్తుండగా... జనసేన మాత్రం బీజేపీని కలుపుకువెళ్లాలన్న పట్టుదలతో ఉంది. రాష్ట్ర బీజేపీ నేతలు కూడా టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకునేందుకు సముఖతతో ఉన్నారు. ఇదే విషయాన్ని వారు జాతీయ నేతల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా బీజేపీకి మద్దతివ్వడానికి అంగీకరిస్తుందే తప్ప... బహిరంగ ఎన్నికల పొత్తుకు ముందుకు రావడం లేదు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల ముఖ్యంగా ముస్లిం ఓటింగ్ కోల్పోవాల్సి వస్తుందని వైసీపీ భయపడుతోంది. అందువల్ల టీడీపీ, జనసేనతో పొత్తు అనివార్యమని, లేనిపక్షంలో ఒకశాతం ఓట్లు కూడా లేని బీజేపీకి చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండే అవకాశం లేదని బీజేపీ రాష్ట్ర నేతలు తమ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పొత్తు కోసం చంద్రబాబుపై బీజేపీ జాతీయనేతలు ఒత్తిడి పెంచుతున్నారు. దీనిలో భాగంగానే చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఖరారైనట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనలో చంద్రబాబు ఎవరిని కలుస్తారు? బీజేపీతో పొత్తుకి అంగీకరిస్తారా ? లేక తర్వాత మద్దతిస్తామని నచ్చచెప్పే ప్రయత్నం చేస్తారా ? అనేది తేలాల్సి ఉంది.

ఇదీ లోకం!

ఎందుకు గుర్తుండదు సార్..
మీ అన్ని విదేశీపర్యటనలు, ఖర్చులు
ఇంకెవరూ చేయలేదు కదా!

విచ్చలవిడి దోపిడీ

- పురుగుమందు కంపెనీల ఇష్టారాజ్యం
- నియంత్రణ లేని ధరలు
- పెరిగిపోతున్న సేద్యపు ఖర్చు
- కొరవడిన పర్యవేక్షణ

విశాలాంధ్ర బ్యూరో– ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రధాన సేద్యం వరి. సేద్యపు ఖర్చులో కూలీలు, ఎరువులతో పాటు పురుగు మందులు కీలకపాత్ర పోషిస్తున్నాయి. గతంలో వందల్లో అయ్యే వ్యయం నేడు వేలకు చేరుకుంది. పురుగు మందుల కంపెనీలు సామాజిక బాధ్యతను విస్మరించి...రైతును దారుణంగా దోచుకుంటున్నాయి. రైతుల సంక్షేమానికి ఎటువంటి కృషి చేయడం లేదు. పాతతరం పురుగుమందులు గెమాక్సిన్, ఎండో సల్ఫాన్, క్లోరో ఫైరిఫాస్, మోనోక్రోటోఫాస్, ఫాస్ఫామిడాన్, డైక్లోరోవాస్ రైతులందరికీ చిరపరిచితమే. గతంలో ఏ తెగులు వచ్చినా వీటి మీదనే రైతు ఆధారపడేవాడు. ఒక సీజన్‌లో నాడు రైతులకు పురుగు మందులకు అయ్యే ఖర్చు ఎకరాకు రూ.1000 మించేది కాదు. అయితే తెగుళ్ల రూపం మార్చుకొని పెరిగిపోతుండటంతో

- మిగతా 2 లో

తెరపైకి యూసీసీ బిల్లు

- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఉత్తరాఖండ్ సీఎం ధామి
- గిరిజనులకు మినహాయింపు
- సహజీవనానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ముసాయిదా బిల్లులో కీలకాంశాలు
- ప్రతిపక్షాల తీవ్ర నిరసన

డెహ్రాడూన్: వివాదాస్పద ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లును బీజేపీ మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. ఈ బిల్లును ఉత్తరాఖండ్ ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందితే వరుసగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ ప్రవేశపెట్టాలని భావిస్తోంది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత యూసీసీ బిల్లు తీసుకు రావడం ఇదే ప్రథమం. ప్రతిపక్షాల నిరసనలు, నినాదాల మధ్య ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో శాసనసభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఇది ఆమోదం పొందితే స్వాతంత్ర్యానంతరం దేశంలోనే ఉమ్మడి పౌరస్మృతిని అమలు

- మిగతా 2 లో

బ్రిటన్ రాజుకు క్యాన్సర్

లండన్: బ్రిటన్ రాజు ఛార్లెస్-3 ఓ రకమైన క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ ప్రకటించింది. అయితే ఇది ప్రొస్టేట్ క్యాన్సర్ కాదని స్పష్టం చేసింది. ఇటీవల విస్తరించిన ప్రోస్టేట్ కోసం చికిత్స తీసుకుంటున్న క్రమంలో క్యాన్సర్ విషయం బయటపడిందని పేర్కొంది. క్యాన్సర్ రకం గురించి వెల్లడించనప్పటికీ 75 ఏళ్ల రాజు ఛార్లెస్-3 సోమవారం నుంచి సాధారణ చికిత్స తీసుకుంటున్నట్టు బకింగ్ హామ్ ప్యాలెస్ తెలిపింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వెల్లడించింది. వీలైనంత త్వరగా ఛార్లెస్-3 పూర్తి విధుల్లోకి రావాలనుకుం టున్నారనీ చికిత్స సమయంలో బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండనున్నారని ప్యాలెస్ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఆయన హాజరయ్యే అధికారిక కార్యక్రమాలు ఇతర సీనియర్ రాజ కుటుంబీకులు నిర్వర్తించనున్నారు. 2022 సెప్టెంబరులో తన తల్లి క్వీన్ ఎలిజబెత్-2 96 ఏళ్ల వయసులో మరణించిన పిమ్మట ఛార్లెస్-3 బ్రిటన్ రాజుగా ఎన్నికయ్యారు.

దేశాధినేతల స్పందన

ఛార్లెస్-3 క్యాన్సర్ బారిన పడడంపై బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'మీరు త్వరగా కోలుకోవాలి. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో మీరు తిరిగి వస్తారనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు. దేశం మొత్తం మీ వేగవంతమైన రికవరీని కోరుకుంటుంది' అని పేర్కొన్నారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో పాటు బ్రిటన్ మాజీ ప్రధానులు లిజ్ ట్రస్, బోరిస్ జాన్సన్, సర్ టోనీ బ్లెయిర్ కూడా 'ఎక్స్' వేదికగా రాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'రాజు ఛార్లెస్-3 క్యాన్సర్ బారిన పడ్డారని తెలిసింది. ఇది విచారించాల్సిన విషయం. నేను త్వరలోనే ఆయనతో మాట్లాడే ప్రయత్నం చేస్తాను' అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఛార్లెస్-3ని ఒక గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు. తాను అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయనతో మంచి సాన్నిహిత్యం ఉండేదని చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, క్యాన్సర్‌తో బాధపడుతున్న బ్రిటన్ రాజు ఛార్లెస్-3 త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

కాలిఫోర్నియాలో తుపాను బీభత్సం

- అనేక నగరాల్లో కుంభవృష్టి...ముగ్గురి మృతి
- 8 కౌంటీల్లో అత్యవసర పరిస్థితి విధింపు

వాషింగ్టన్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రాన్ని శక్తిమంతమైన పసిఫిక్ తుపాను అతలాకుతలం చేసింది. ఈ తుపాను కారణంగా కాలిఫోర్నియా రాష్ట్రంలోని అనేక నగరాల్లో కుంభవృష్టి కురిసింది. ఈ వర్షాలకు నదులు పొంగి పొర్లుతుండటంతో వరదలు పోటెత్తాయి. వరదలకు తోడు బలమైన గాలులు కూడా వీస్తున్నాయి. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. అనేక ప్రాంతాల్లో భారీగా బురద పోటెత్తింది. వాహనాలు బురద నీటిలో చిక్కుకుపోయాయి. బలమైన గాలులకు చాలా చోట్ల చెట్లు నేలకొరిగాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలోని ఎనిమిది కౌంటీల్లో అత్యవసర పరిస్థితిని విధించారు. రికార్డు స్థాయిలో కురిసిన వర్షాలకు విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చాలా చోట్ల వీధుల్లోకి బురద కొట్టుకొచ్చింది. పలు చోట్ల రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరదల కారణంగా దెబ్బతిన్న పసిఫిక్ తీర హైవేను అధికారులు మూసివేశారు. కొండచరియలు విరిగిపడుతుండటంతో రాష్ట్రంలోని దక్షిణాన ఉన్న పర్వతప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ప్రభుత్వం కోరింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించింది. శాన్ ఫ్రాన్సిస్కో దాని పరిసర ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. చెట్లు విరిగిపడి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. లాస్ ఏంజెల్స్ ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి. అక్కడ గత 150 ఏళ్లలో నమోదైన అత్యధిక వర్షపాతాల్లో ఇది మొదటి ఐదు స్థానాల్లో ఉంది. ఇక్కడ గత రెండు రోజుల్లో 10 అంగుళాల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. మంగళవారం కూడా అక్కడ భారీ వర్షాలు, వరదలు సంభవించే ప్రమాదం ఉందని స్థానిక వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు ఇదే తుపాను లాస్‌వేగాస్, నెవాడ ప్రాంతాల్లో భారీ హిమపాతానికి కారణమైంది. కాలిఫోర్నియా, అరిజోనా, నెవాడాల్లో 3.5 కోట్ల మంది ప్రస్తుతం వరద ముప్పులో ఉన్నారు. సుమారు 2,90,000 గృహాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కుంభవృష్టి వల్ల వేల సంఖ్యలో విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది.

జాంబియాను వెంటాడుతున్న కలరా

లుసాకా: ఆఫ్రికా దేశం జాంబియాను కలరా వెంటాడుతోంది. వేలాదిమంది ఈ అతిసార వ్యాధి బారినపడగా... వందల సంఖ్యలో ప్రజలు మృతి చెందుతున్నారు. కలరా విజృంభణతో మునుపెన్నడూ ఎరుగని రీతితో జాంబియా వైద్యపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం... గత ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 600 మంది ప్రాణాలు కోల్పోయారని, 15 వేల మంది ఈ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. ఆ దేశంలోని మొత్తం పది ప్రావిన్సుల్లో తొమ్మిదింటిలో ఈ వ్యాధి ప్రబలింది. స్టేడియాల వద్ద ప్రభుత్వం తాత్కాలిక చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేసింది. పెద్ద ఎత్తున వాక్సినేషన్‌ను ప్రారంభించింది. ప్రభావిత ప్రాంతాలకు శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తోంది. పరిస్థితులు దిగజారడంతో విశ్రాంత వైద్య సిబ్బంది సేవలను కూడా వినియోగించుకుంటోంది. కాగా ఈ సమయంలో భారీ వర్షాలు వైద్య సేవలు, సురక్షిత నీటి సరఫరాకు ఆటంకం కలిగిస్తున్నాయి. సాధారణంగా కలరా వ్యాధి మరణాల రేటు ఒకశాతం కంటే తక్కువగా ఉంటుంది. కానీ జాంబియాలో ఆ పరిస్థితి భిన్నంగా ఉంది. ఆ రేటు నాలుగు శాతం కంటే ఎక్కువగా ఉండటం కలవరపాటుకు గురిచేస్తోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో భారతదేశం జాంబియాకు ఆపన్న హస్తం అందించింది. ఆ దేశానికి క్లోరిన్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి శుద్ధి యంత్రాలతో కూడిన 3.5 టన్నుల మానవతా సాయాన్ని పంపించింది.

ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం

(మొదటిపేజీ తరువాయి)

సవాల్ చేస్తూ పంజాబ్ ప్రభుత్వం 2010లో దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన పిటిషన్‌గా తీసుకొని...దీనికి మరో 23 పిటిషన్లు జతకలిపి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాల్మీకీలు, మజాబీ సిక్కులకు 50 శాతం ఎస్సీ రిజర్వేషన్ కల్పిస్తూ పంజాబ్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో 2004లో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఆ చట్టం ఉల్లంఘించిందని హైకోర్టు పేర్కొంది. షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి ఉపకులాల వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లేనని చిన్నయ్య జడ్జిమెంట్ స్పష్టం చేసింది. ఎస్సీ వర్గీకరణ పిటిషన్‌పై పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను రాష్ట్ర అడ్వకేట్ జనరల్ వివరించారు. విచారణలో భాగంగా అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను రాజ్యాంగ ధర్మాసనం తెలుసుకుంటుంది. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు రాజ్యాంగం అనుమతిస్తుందా? లేదా అన్నది రాజ్యాంగ ధర్మాసనం తేల్చనుంది. వర్గీకరణకు రాష్ట్రశాసనసభలు సిద్ధంగా ఉన్నాయా? రిజర్వేషన్లకు సంబంధించి అసమానతలు తొలగించడానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలేంటి వంటి వివరాలను ధర్మాసనం తెలుసుకోనుంది. గతంలో ఏపీ కల్పించిన వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం విదితమే. అయితే వర్గీకరణకు సంబంధించి రాజ్యాంగ సవరణ చేయాలని నాడు యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉషా మెహ్రా కమిషన్ అభిప్రాయపడింది. ఉషా మెహ్రా కమిషన్ సిఫార్సులను కేంద్రం పరిగణనలోకి తీసుకుంది. ఎస్సీ వర్గీకరణపై కేంద్రం అధ్వర్యంలో ఇప్పటికే ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. కమిటీలో కేంద్ర హోంశాఖ, న్యాయశాఖ, గిరిజన, సామాజిక న్యాయ శాఖల కార్యదర్శులను సభ్యులుగా కేంద్రం నియమించింది. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు రాజ్యాంగం అనుమతిస్తుందా? లేదా అన్నది రాజ్యాంగ ధర్మాసనం తేల్చనుంది. వర్గీకరణకు రాష్ట్రశాసనసభలు సిద్ధంగా ఉన్నాయా?. రిజర్వేషన్లకు సంబంధించి అసమానతలు తొలగించడానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలేంటి? వంటి వివరాలను ధర్మాసనం తెలుసుకోనుంది. కాగా, అంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఎస్సీ వర్గీకరణ కోసం నాలుగు దశాబ్దాలుగా ఉద్యమాలు జరుగుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఈ సమస్య మళ్లీ వివాదంలో పడింది. ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం అవిశ్రాంత పోరాటం చేస్తున్నారు. సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణకు తెలంగాణ మంత్రి దామోదర రాజనరసింహాతో పాటు మంద కృష్ణ మాదిగ కూడా హాజరయ్యారు.

దద్దరిల్లిన అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కి మరీ బిగ్గరగా నినాదాలు చేశారు. స్పీకర్ చైర్ వద్దకు దూసుకొచ్చిన టీడీపీ సభ్యులు బాదుడే బాదుడు అంటూ నినా దాలు చేశారు. చేతుల్లోని అజెండా కాగితాలను చించి గాల్లోకి విసిరేశారు. మరోవైపు వైసీపీ సభ్యులు కూడా వారికి కౌంటర్‌గా నినాదాలు చేశారు. ఈ క్రమంలో శాసనసభలో తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది. దీంతో శాసనసభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి టీడీపీ సభ్యులను అసెంబ్లీ నుంచి ఒక రోజు స్పీకర్ సస్పెండ్ చేయాల్సిందిగా కోరుతూ తీర్మానాన్ని ప్రతిపాదించారు. సస్పెన్షన్ తీర్మానాన్ని స్పీకర్ చదువుతున్న సమయంలో పోడియంపై ఉన్న టీడీపీ సభ్యులు ఈలలు వేస్తూ నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వెళ్లాలని స్పీకర్ ఆదేశించినప్పటికీ వారు అక్కడి నుంచి కదలలేదు. దీంతో మార్షల్స్ రంగం ప్రవేశం చేసి వారిని బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఆ సమయంలో కూడా టీడీపీ సభ్యులు ఈలలు వేసుకుంటూనే బయటకు వెళ్లారు.

జగన్‌ను ప్రజలు సస్పెండ్ చేసే రోజు దగ్గర్లోనే: బుచ్చయ్య చౌదరి, రామానాయుడు

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసరాల ధరలపై సభలో చర్చ చేపడితే తన బాగోతం బయట పడుతుందన్న భయంతోనే ముఖ్యమంత్రి టీడీపీ సభ్యులను సస్పెండ్ చేయించాడని టీడీపీ శాసనసభ్యులు ఆరోపించారు. స్పీకర్ వెన్నెముక లేకుండా వ్యవహరిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి చెప్పిందే తనకు వేదం అన్నట్టుగా సభను నడుపుతున్నారని విమర్శించారు. ప్రజల కోసం గొంతెత్తిన టీడీపీ సభ్యులను అన్యాయంగా సస్పెండ్ చేసిన ఈ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని ప్రజలు త్వరలో రాష్ట్రం నుంచే సస్పెండ్ చేసే రోజు దగ్గర్లోనే ఉందని టీడీపీ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రామానాయుడు మీడియా ఎదుట విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతిపక్ష టీడీపీ సభ్యులకు ఎన్నిసార్లు సభలో మాట్లాడే అవకాశమిచ్చారు. ఎంత సమయం ఇచ్చారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మాట్లాడకుండా ఎన్నాళ్లు మా గొంతులు నొక్కేస్తారు? నాలుగు సంవత్సరాల 10 నెలల పాలనలో ఎన్ని నిమిషాలు టీడీపీ సభ్యులకు అవకాశమిచ్చారో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల సమస్యలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న అతి ప్రధానమైన ధరల పెరుగుదల సమస్యలపై మాట్లాడకుండా మమ్మల్ని సభలో అడ్డుకుంటారా? వాటిని కూడా అణచివేస్తారా? అసెంబ్లీ ప్రాంగణంలో అన్ని వేల మంది పోలీసులను ఎప్పుడైనా చూశామా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నివాసం ఉండే తాడేపల్లి ప్యాలెస్ నుంచి అసెంబ్లీ వరకు కనీసం 4 వేల మంది పోలీసులున్నారని, ఇంత పిరికి సన్నాసి ముఖ్యమంత్రిని, ప్రజలకు భయపడే ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదన్నారు. ప్రజలకు అంత బ్రహ్మాండంగా సేవలు అందించి, గొప్ప పాలన అందిస్తే ఇన్ని వేల మంది పోలీసులను జగన్‌మోహన్ రెడ్డి ఎందుకు కాపలా పెట్టుకుంటున్నాడో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

చలో అసెంబ్లీ ఉద్రిక్తం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అసెంబ్లీ పరిసరాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసెంబ్లీ ముట్టడికి సర్పంచులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో 'చలో అసెంబ్లీ'కి పిలుపునిచ్చారు. దీంతో ఇటు విజయవాడ, అటు గుంటూరు నగరాల నుంచి అసెంబ్లీ వరకు పోలీసులు భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. అన్ని రహదారుల్లో పెద్దసంఖ్యలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. చివరకు బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను కూడా వదిలిపెట్టలేదు. అలాగే సోమవారం రాత్రి నుంచే ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్నారు. సర్పంచ్‌ల సంఘాల నేతలు ముందస్తు అరెస్టులు చేశారు. అయినప్పటికీ పోలీసుల కళ్లుగప్పి అసెంబ్లీ పరిసరాల వరకూ కొందరు సర్పంచులు వచ్చారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం దారిమళ్లించిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ నిధులను సర్పంచుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ నిధులను చట్టప్రకారం పంచాయతీలకు ఇవ్వాలని కోరారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకున్నారు. లాఠీలతో కొడుతూ ఈడ్చుకెళ్లి బస్సుల్లో పడేశారు. ఈ ఘటనలో కొందరు సర్పంచులకు తీవ్ర గాయాలయ్యాయి. సర్పంచుల చలో అసెంబ్లీకి వెళ్లకుండా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను ఉయ్యూరులో పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రతినిధులను మందడంలో అరెస్ట్ చేసి తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అరెస్ట్ చేసిన సర్పంచ్ లను విడుదల చేసి బహిరంగ క్షమాపణలు చెప్పాలని టీడీపీ శాసనసభ్యులు డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని పోలీస్ రాజ్యంగా మార్చి, నియంతృత్వ పోకడలు పోతున్న ఈ ముఖ్య మంత్రికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉంది. పవిత్రమైన చట్టసభల్ని నిర్వీ ర్యం చేసి, ప్రజాప్రతినిధులకు గౌరవం లేకుండా చేశాడు. అరెస్ట్ చేసిన సర్పంచ్ లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయించి, వారికి బహిరంగ క్షమాపణలు చెప్పాలి. వారికి కేటాయించాల్సిన నిధులు కేటాయించి, గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి సహకరించాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్ లకు ప్రభుత్వమే తగిన రక్షణ కల్పించాలి. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో సర్పంచ్ లు, ఎంపీటీసీలు ఎందుకూ పనికిరాని వారిగా మారిపోయారు. స్థానిక సంస్థల్లో ఖాళీ అయిన స్థానాల్లో ముఖ్యమంత్రి ఎందుకు ఎన్నికలు నిర్వహించడు? ఓటమి భయంతోనే ఎన్నికల గురించి ఆలోచించడం లేదు. ఈ దుర్మార్గపు ముఖ్యమంత్రి రాక్షస పాలన అంతం అయితేనే స్థానిక సంస్థలకు మరలా మంచిరోజులు వస్తాయని వారు పేర్కొన్నారు.

సర్పంచ్‌ల అరెస్టుకు రామకృష్ణ ఖండన

విశాలాంధ్ర-విజయవాడ: సమస్యల పరిష్కారం కోరుతూ శాంతి యుతంగా 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి పిలుపునిచ్చాన సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఏపీలోని 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్రం 14,15వ ఆర్థిక సంఘం ద్వారా పంపిన రూ. 8,629 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడేసిందన్నారు. ఆయా నిధులను తిరిగి పంచాయతీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలను, వలంటీర్లను గ్రామ పంచాయతీల, సర్పంచుల ఆధీనంలోనే పని చేయించాలన్నారు. ఉపాధి హామీ నిధులను చట్ట ప్రకారం గ్రామ పంచాయతీలకు ఇచ్చి సర్పంచ్‌లతోనే ఖర్చు చేయించాలని, గతంలో మాదిరే గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రూ.15 వేలు, ఎంపీపీలు, జడ్పీటీసీలకు రూ.30 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలనే తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లు చలో అసెంబ్లీకి సిద్ధమయ్యారని చెప్పారు. ఈ ఈ మేరకు శాంతియుతంగా అసెంబ్లీకి చేరుకున్న సర్పంచ్‌లను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి తదితరులను అక్రమంగా అరెస్టులు చేసి, వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించడాన్ని రామకృష్ణ ఖండించారు. రాష్ట్రంలో నిరంకుశ, నిర్బంధ పాలన నడుస్తుందనటానికి ఈ అక్రమ అరెస్టులు తార్కాణం అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌ల హక్కులను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం హరిస్తోందని విమర్శించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే తీసుకున్న కేంద్ర నిధులు తిరిగి ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామాల అభివృద్ధికి తగు నిధులు కేటాయించాలన్నారు. సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం తగ్గించాలి

ఎస్ఈసీ ముకేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికలలో డబ్బు, మద్యం ప్రభావాన్ని తగ్గించాలంటే కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అన్నారు. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం కోసం త్వరలో ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ముకేశ్ కుమార్ మీనా కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఇటీవల ఈ రెండు శాఖలు దాడులు ముమ్మరం చేయడంపై సానుకూలంగా స్పందించారు. అయితే దాడులు సామాన్యులను ఇబ్బంది పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే వరకూ దాడుల్లో సరైన పత్రాలు లేకుండా రూ.10 లక్షల పైచిలుకు నగదు ఉన్నప్పుడే జప్తు చేసి ఆదాయ పన్ను శాఖకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల ఐజీ వెంకట్రామిరెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ స్పెషల్ కమిషనర్ ఆనంద్, ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ దేవకుమార్, రవాణా శాఖ అదనపు కమిషనర్ ప్రసాదరావు, సెబ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, డిప్యూటీ సీఈవో విశ్వేశ్వర రావు, అసిస్టెంట్ సీఈవో తాతబ్బాయి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇతర రాష్ట్ర, కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడి దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

పురుగుమందుల కంపెనీలు కూడా పరిశోధనలు చేసి నూతన మందులను ఆవిష్కరించి రైతులకు పరిచయం చేశాయి. ఈ నూతన రకం పురుగుమందుల ధరలు వేలల్లోనే ఉంటున్నాయి. దీంతో వరి సేద్యానికి సంబంధించి ఒక సీజన్‌లో పురుగు మందుల పెట్టుబడి ఖర్చు ఎకరాకు రూ.10 వేలకు మించిపోతోంది. పాత మందులు వాడుతున్నప్పుడు ఎకరాకు 4 నుండి 5 బస్తాల దిగుబడి కాగా నూతనరకం పురుగు మందుల వాడకంలో ఎకరాకు 6 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తోంది. అంటే దిగుబడి పెరిగిందేమీ కనిపించడం లేదు. తెగుళ్లు తగ్గకపోతే మరికొన్ని వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సిందే. రైతు వాడే ఎరువులపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ ఉంటుంది. కానీ పురుగు మందుల ధరలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో నియంత్రణ చట్టాలు ఉన్నాయి. అదేమీ రైతుకు ఉపయోగపడటం లేదు. పురుగు మందుల కంపెనీలు సాంకేతికత పేరుతో మందును తయారు చేస్తే ఒక లీటరుకు లేదా కొన్ని గ్రాములకు అయ్యే ఖర్చు రూ.500 అయితే రైతుల వద్ద నుంచి వసూలు చేసేది రూ.5 వేల వరకు ఉంది. ఒకే సాంకేతిక ఫార్ములా, వివిధ కంపెనీల పేర్లతో మార్కెట్లోకి వస్తే వాటి ధరలలో ఎంతో తేడా ఉంటోంది. అసలు ఏది నకిలీయో గుర్తించలేనంతగా విచ్చలవిడిగా పురుగుమందుల కంపెనీలు తమ బ్రాండ్లతో మార్కెట్‌ను నింపివేస్తున్నాయి. నియంత్రణ లేని ధరలతో రైతు నిలువు దోపిడీకి గురవుతున్నాడు.

దీలర్లకు విదేశీ ట్రిప్పులు

వ్యవసాయం ద్వారా సంపాదించి రాబోయే సీజన్‌కు అప్పు అడగకుండా పెట్టుబడి పెట్టుకునే రైతులను వేలల్లో పరిశీలిస్తే ఒకరు లేదా ఇద్దరు మాత్రమే కనిపిస్తున్నారు. మిగిలిన వారంతా ప్రతి సీజనులో ఎరువులు, పురుగు మందులు అప్పు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. దీనిని పురుగుమందుల డీలర్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. తమకు ఎక్కువ మార్జిన్ వచ్చే పురుగుమందులను అంటగడుతూ అప్పులు రాసుకుంటున్నారు. తెగుళ్లు తగ్గకపోతే మరోరకం పురుగు మందు ఇస్తూ అప్పు పెంచుకుంటూ రైతును నిలువుగా దోపిడీ చేస్తున్నారు. కంపెనీలకు డీలర్లు ఎక్కువ మొత్తం ఆర్డర్ చేస్తే భారీ కమీషన్లతో పాటు ప్రత్యేక బహుమతులు, విదేశీ ట్రిప్పులు కూడా ప్రకటిస్తూ రైతు దోపిడీలో డీలర్లతో పాటు కీలకపాత్ర పోషిస్తున్నాయి. పురుగుమందు తయారు చేసే వ్యయం అతి స్వల్పమైతే అమ్మేది అత్యధికంగా ఉంటోంది. ఈ తేడాను డీలర్లు, పురుగుమందుల కంపెనీలు పంచుకుంటున్నాయి.

కోవిడ్ విపత్కర సమయంలో సాధారణ పరిస్థితులలోనూ ప్రతి సంవత్సరం జిల్లాలోని దాదాపు అన్ని పరిశ్రమలు సహా ప్రధాన కంపెనీలు సామాజిక బాధ్యతగా ఎన్నో ఉపకరణాలు ప్రభుత్వానికి అందజేశాయి. అంతేకాకుండా ప్రతి ఏడాది కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద కోట్ల రూపాయల నిధులు అందజేస్తూ పాఠశాలల అభివృద్ధికి, సామాజిక అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు ఒక సీజన్‌కు 6 లక్షల ఎకరాల పంట సాగు అవుతోంది. వీటితోపాటు ఉద్యాన పంటలు, ఇతర పంటలకు వేలకోట్ల రూపాయల పురుగుమందుల అమ్మకం జరుగుతోంది. రైతును నిలువునా వంచిస్తూ కోట్ల రూపాయల ఆదాయాలు గడిస్తున్న పురుగు మందుల కంపెనీలు రైతుల సంక్షేమానికి చేపట్టే చర్యలు మాత్రం శూన్యం.

పురుగు మందుల ధరలపై ప్రత్యేక విధానం అవసరం

ప్రతి సీజన్‌కు వేల రూపాయల వ్యయంతో రైతులకు గుదిబండగా మారుతూ పెట్టుబడి వ్యయాన్ని అంతకంతకు పెంచుతున్న పురుగు మందుల ధరలపై ప్రత్యేక విధానం, నియంత్రణ ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకోసం వ్యవసాయరంగ నిపుణులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ధరల మదింపు జరగాలి. ఒక్కో సాంకేతిక ఫార్ములాకు సంబంధించి పురుగుమందు తయారీకి పరిశ్రమలకు అవుతున్న వ్యయం, రైతులకు అమ్ముతున్న ధర, వీటి మధ్య గల వ్యత్యాసం, రైతు ఏ విధంగా దోపిడీకి గురవుతున్నది ఆయా కమిటీలు పరిశీలన చేసి రైతులకు ఉపయోగపడే విధంగా పురుగుమందుల ధరలు నియంత్రించే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో రైతులు ఇటీవల ప్రకటించిన క్రాప్ హాలిడే ఘటనలు నిరంతరం చోటుచేసుకునే ప్రమాదం ఉంది. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమగ్ర విచారణ జరిపి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండేలా మేలైన విధానానికి రూపకల్పన చేయాలని రైతులు కోరుతున్నారు. అడ్డు అదుపు లేకుండా పెరిగిపోతున్న పురుగు మందుల ధరలపై ప్రత్యేక కసరత్తు జరగాలని, చర్యలు తీసుకుని రైతుకు మేలు చేకూర్చే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ రంగ నిపుణులు సూచిస్తున్నారు.

అప్పు ఏడు లక్షల కోట్లే

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న చంద్రబాబు గతంలో ఏ మేరకు సంపద సృష్టించారో ఆయన పాలనలో రెవెన్యూ లోటు చూస్తే తేటతెల్లమవుతుందని ఎదురుదాడి చేశారు. నిజంగానే చంద్రబాబు అంత గొప్ప విజనరీ అయితే... ఆయన పాలనలో రాష్ట్రం మెరుగుపడి ఉంటే... ఆయన హయాంలో దేశ జీడీపీలో మన వాటా 4.47 శాతం మాత్రమేనని, అదే వైసీపీ ప్రభుత్వ హయాంలో 4.82 శాతం ఉందన్నారు. దీన్నిబట్టి చూస్తే ఎవరు సంపద సృష్టించారో స్పష్టంగా తెలుస్తుందన్నారు.

ప్రజలను మోసం చేసేందుకే చంద్రబాబు వాగ్దానాలు ఉంటాయని, మనం రూ.70 వేల కోట్లకే చాలా కష్టాలు పడుతూంటే బాబు రూ.1.26 లక్షల కోట్లు ఖర్చు పెట్టడం సాధ్యమేనా? ఇలా మోసం చేయడం, కుట్రలు పన్నడం ధర్మమేనా అని చంద్రబాబును ప్రశ్నించారు. 'ఏ ప్రభుత్వం వచ్చినా కొన్ని కొన్ని పథకాలు రద్దు చేయలేదు. వాటిలో పెన్షన్లకు అయ్యే రూ.23,600 కోట్లు, రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్తు రూ.11,000 కోట్లు, సబ్సిడీ బియ్యం రూ.4600 కోట్లు, ఆరోగ్య శ్రీ, ఆరోగ్య ఆసరా రూ.4,400 కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2,800 కోట్లు, వసతి దీవెన రూ.2,200 కోట్లు, సంపూర్ణ పోషణ కింద బాలింతలు, గర్భిణులు, ఆరేళ్ల లోపు చిన్నారులకు రూ.2,200 కోట్లు, గోరుముద్ద కింద పోషకాహారం కోసం రూ.1,900 కోట్లు...మొత్తం ఈ ఎనిమిది పథకాలకు రూ.52,700 కోట్లు ఖర్చు అవుతోంది. వీటిని ఏ ప్రభుత్వం కూడా రద్దు చేయలేదు. వీటికి మించి ఇస్తానని చెప్పడమంటే అది ప్రజలను మోసగించడమేనన్నారు. బాబు వయసు 75 సంవత్సరాలు. రాజకీయాల్లోకి వచ్చి 45 ఏళ్లు అయింది. మొదటిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు అవుతోంది. మూడుసార్లు సీఎం అయిన తరువాత కూడా ఇప్పటికీ ఫలానా పని చేశాను కాబట్టి తనకు ఓటేయండని చంద్రబాబు అడగలేకపోతున్నాడని జగన్ విమర్శించారు. మరోసారి అవకాశమిస్తే అది చేస్తా.. ఇది చేస్తా అని మాత్రమే అంటున్నారన్నారు.

చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదని, పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని ఆరోపించారు. మన 57 నెలల ప్రయాణంలో ఎక్కడా అవినీతికి తావివ్వలేదన్నారు. వివక్ష లేకుండా ప్రతి రూపాయి ప్రజలకు చేరుతోందని, బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. వాస్తవానికి తెలంగాణతో పోలిస్తే ఏపీ ఆదాయం తక్కువ. విభజన కారణంగా ఏటా రూ.13 వేల కోట్లు నష్టపోయాం. అంటే ఈ ఐదేళ్లలో లక్ష కోట్ల అదనపు ఆదాయం కోల్పోయాం. దీనికితోడు కరోనా కారణంగా రెండు ఆర్థిక సంవత్సరాలు తీవ్రంగా నష్టపోయాం. ఆదాయం తగ్గడంతో పాటు ఖర్చులూ పెరిగాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గాయి. ఈ కష్టాలను ఎదుర్కొని ఐదేళ్లు సుపరిపాలన అందించగలిగామన్నారు. మంచి జరిగితేనే తనకు అండగా ఉండాలని ప్రజలకు జగన్ విజ్ఞప్తి చేశారు.

తెరపైకి యూసీసీ బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

చేయనున్న తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలువనుంది. గోవాలో పోర్చుగీసు పాలన నుంచి ఉమ్మడి పౌరస్మృతి ఉంది. 2022లో ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో యూసీసీ తీసుకొస్తా మని హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే సీఎం పుష్కర్‌సింగ్ ధామి... దీనిపై కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు సుదీర్ఘ కసరత్తు చేసింది. 70కి పైగా సమావేశాలు నిర్వహించి 60వేల మందితో మాట్లాడింది. ఆన్‌లైన్‌లో వచ్చిన 2.33 లక్షల సలహాలు, సూచనలు పరిశీలించింది. అనంతరం ముసాయిదా రూపొందించి ఇటీవల సీఎంకు సమర్పించింది. ఇది అమల్లోకి వస్తే రాష్ట్రంలో మతాలకు అతీతంగా పౌరులందరికీ ఒకే తరహా వివాహ, విడాకుల, భూమి, ఆస్తి, వారసత్వ చట్టాలు వర్తిస్తాయి. ప్రతిపాదిత బిల్లు పరిధి నుంచి గిరిజనులకు మినహాయింపు ఇచ్చారు. సహజీవనం(లివ్ ఇన్ రిలేషన్‌షిప్)లో ఉన్న వారు మాత్రం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పొందుపరిచారు. సహజీవనంలో ఉన్న తల్లిదండ్రులకు పుట్టిన బిడ్డకు చట్టబద్ధత లభిస్తుంది. అదేసమయంలో విడిపోతే...మహిళలకు భరణం చెల్లించాల్సి ఉంటుంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ బిల్లు తీసుకురావడం బీజేపీ అజెండాలో భాగంగానే పరిగణించాల్సి ఉంది.

ప్రతిపాదిత ముసాయిదా బిల్లు ప్రకారం సహజీవనంలో ఉండాలనుకుం టున్న జంటలు ఇకపై రాష్ట్ర ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుంది. 'లివ్-ఇన్'లో ఉంటూ, ఆ సంబంధాన్ని రిజిస్ట్రేషన్ చేయించకపోతే ఆ జంటకు ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.25 వేల జరిమానా లేదా రెండూ విధించే అవకాశాలున్నాయి. 'లివ్ ఇన్'లో ఉంటున్న జంట ఈ రిజిస్ట్రేషన్‌తో స్వీకరించే రసీదు ఆధారంగానే అద్దె ఇల్లు, హాస్టల్ లేదా పీజీ సౌకర్యం పొందగలుగుతారు. 'యూసీసీ' బిల్లులో 'లివ్-ఇన్' సంబంధం గురించి స్పష్టమైన వివరణ ఇచ్చారు. దీని ప్రకారం ఒక వయోజన పురుషుడు, ఒక వయోజన మహిళ మాత్రమే లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండగలుగుతారు. అలాంటివారు ఇప్పటికే వివాహం చేసుకోకూడదు లేదా మరొకరితో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో లేదా నిషేధిత సంబంధాలలో ఉండకూడదు. లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉంటున్న ప్రతి వ్యక్తి తప్పనిసరిగా రిజిస్టర్డ్ వెబ్ పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇటువంటి రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్నాక రిజిస్ట్రార్ వారికి రిజిస్ట్రేషన్ రసీదు అందజేస్తారు. ఆ రశీదు ఆధారంగా ఆ జంట ఇల్లు లేదా హాస్టల్ అద్దెకు తీసుకోవచ్చు. అయితే 'లివ్ ఇన్' కోసం రిజిస్ట్రార్ రిజిస్టర్ చేయించుకున్న జంట ఆ విషయాన్ని తల్లిదండ్రులకు లేదా సంరక్షకులకు తప్పనిసరిగా తెలియజేయాలి. 'లివ్ ఇన్'లో ఉంటున్న సమయంలో ఆ జంటకు పుట్టిన పిల్లలు ఆ జంటకు చెందిన చట్టబద్ధమైన పిల్లలుగా గుర్తింపు పొందుతారు. అలాంటి పిల్లలు వారి తల్లిదండ్రుల ఆస్తులపై అన్ని హక్కులు పొందుతారు. 'లివ్-ఇన్' రిలేషన్‌షిప్‌లో ఉంటున్నవారు విడిపోవాలనుకున్నా, తిరిగి ఆ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్‌లో తప్పుడు సమాచారం ఇస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ఆరోగ్యకర సమాజం అవశ్యం

వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

60 మంది విద్యార్థులకు బంగారు పతకాల అందజేత

డాక్టర్ ప్రతిమామూర్తికి డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని, ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేస్తోందని గవర్నర్, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. విజయవాడలోని ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం వైఎస్ఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ 26వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. విశిష్ట అతిథిగా వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్... వైద్యవిద్యలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రతిభ కనబర్చిన 60 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాతో పాటు పతకాలు, బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ప్రపంచంతో పోటీ పడేలా విద్యార్థులను తీర్చిదిద్దిన అధ్యాపకుల కృషిని ప్రశంసించారు. డాక్టర్ ఆఫ్ సైన్స్ (హానరీస్ కాసా)లో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ స్వీకరించిన బెంగళూరులోని నిమ్హాన్స్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ అండ్ న్యూరో సైన్సెస్) సైకియాట్రీ సీనియర్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ ప్రతిమామూర్తిని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో వైద్యరంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, నిరుపేదలకు సేవాభావంతో వైద్యసేవలు అందించాలని గవర్నరు సూచించారు. భవిష్యత్‌లో కఠోర శ్రమ, పట్టుదల, నిజాయతీతో పనిచేయాలని చెప్పారు. రోగికి చికిత్స అందించడమే కాకుండా... రోగి కళ్లలో ఆనందం నింపి క్షేమంగా ఇంటికి పంపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందన్నారు. వైద్యవిద్యను అందరికీ చేరువ చేసిందన్నారు. వైద్య రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 53,126 మంది వైద్య సిబ్బందిని నియమించిందని చెప్పారు. ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు కొత్తగా ప్రారంభించి తరగతులు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. డాక్టర్ ప్రతిమామూర్తి మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ అందించినందుకు గవర్నర్‌కు, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్, పాలక వర్గానికి ధన్యవాదాలు తెలిపారు. వైస్‌చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో చేపట్టిన సంస్కరణలు అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి, అకడమిక్ జాయింట్ రిజిస్ట్రార్ అజయ, రీసెర్చ్, డెవలప్‌మెంట్ డైరెక్టర్ సుమిత శంకర్, జాయింట్ రిజిస్ట్రార్ (ఎగ్జామినేషన్స్) పి.ప్రవీణ్ కుమార్, యూనివర్సిటీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొడదాం

గుజ్జుల ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-బెలగాం: రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా సీపీఐ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు అధ్యక్షతన మంగళవారం బెలగాంలోని స్థానిక రైతు బజార్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవనంలో జరిగింది. ఈశ్వరయ్య మాట్లాడుతూ సిద్ధం అంటూ సభలు పెడుతూ తిరుగుతున్న సీఎం జగన్ దేనికి సిద్ధమని ప్రశ్నించారు. భూములు, ఇసుక, మద్యం, గనులు దోచుకోవడానికి సిద్ధమా? దళిత, గిరిజన, బహుజన హక్కులు కాలరాయడానికి సిద్ధమా? రూ.11 లక్షల కోట్లు అప్పుచేసినందుకు సిద్ధమా? డీఎస్సీ ఇవ్వకుండా నిరుద్యోగులను నట్టేట ముంచినందుకు సిద్ధమా అని నిలదీశారు. ప్రత్యేకహోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలు, కడప స్టీల్ ప్లాంట్, పోలవరం సాధించడంలో జగన్ విఫలమయ్యారని ఈశ్వరయ్య విమర్శించారు. ఇవేమీ సాధించకపోయినా బీజేపీ పల్లకీ మోస్తున్నారని విరుచుకుపడ్డారు. దేవుడిని, మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం రాజ్యాంగ వ్యతిరేకమని, వికసిత భారతదేశం కాదు... వివక్షను పెంచే దేశమే ప్రధాని మోదీ లక్ష్యమని మండిపడ్డారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏ కంపెనీలో ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్, సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 14 మంది ప్రధాన మంత్రులు రూ.55 లక్షల కోట్లు అప్పుచేస్తే...మోదీ ఒక్కరే నూరు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేశారని తెలిపారు. అభివృద్ధి అంటే ఆవు పేడ, గోమూత్రం, రాజ్యాంగంపై దాడి, ప్రజాస్వామ్య హక్కులపై దాడి, రాజ్యాంగ విధ్వంసం, పరమత ద్వేషం కాదని హితవు పలికారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పన

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని మురుగు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ, పట్టణ గృహ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ పథకం (నమస్తే)లో ప్రతి ఒక్కరూ నమోదు కావాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రు డు కోరారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ అమలుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పురపాలక సంఘాల పరిధిలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని పుంపాలక సంఘాల పరిధిలో ఉన్న మలమురుగు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికుల గుర్తింపు పక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. ఇందుకు గాను మల, మురుగు శుభ్రపరచు కార్మికులు, సెప్టిక్ టాంక్ డ్రైవర్లు, హెల్పర్లతో పాటు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా నిమగ్నమై ఉన్నవారు తమ పరిధిలోని పురపాలక సంఘంలో ఈ పథకం ద్వారా వివరాలను నమోదు చేసుకోవలసి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే "నమస్తే" సమన్వయకర్తలు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నేతృత్వంలో మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికుల సంక్షేమానికి కార్యచరణ సిద్ధం చేశారని చెప్పారు. అర్హులైన వారు మొబైల్ యాప్ లింక్ ద్వారా కూడా నమోదు కాచ్చన్నారు.

బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే

ప్రజాస్వామ్యం, లౌకికవాదం కనుమరుగే

రావి, అడ్డాడ సంస్మరణ సభలో ముప్పాళ్ల

విశాలాంధ్ర-చల్లపల్లి: మోదీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం, లౌకికవాదం కనుమరు గవుతాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు కామ్రేడ్ రావి బాబురావు, అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు సంస్మరణ సభ కృష్ణాజిల్లా వక్కలగడ్డలో మంగళవారం జరిగింది. ముప్పాళ్ల మాట్లాడుతూ బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగానికి ముప్పు వాటిల్లిందని, ప్రధాని మోదీ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. బీజేపీకి దేశం నుంచి విముక్తి కల్పించాల్సిన బాధ్యత లౌకికపార్టీలకు, మేధావులకు, గ్రామీణ ప్రజానీకంపై ఉందన్నారు. బీజేపీ వ్యతిరేక ప్రాంతీయ పార్టీలను ఈడీ, సీబీఐలను ప్రయోగించి లొంగదీసు కుంటున్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీలు ప్రజలతో మమేకమై ఉంటాయని, కమ్యూనిస్టులు చేసిన అనేక ఉద్యమాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని గుర్తుచేశారు. రాజకీయాలు కలుషితమయ్యాయని, అధికారమే పరమావధిగా నాయకులు పనిచేస్తున్నారని విమర్శించారు. విభజన హామీలు సాధించడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని చెప్పారు. రావి బాబురావు, అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు వంటి ఉత్తమ కమ్యూనిస్టుల ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని, అదే వారికిచ్చే నిజమైన నివాళి అని ముప్పాళ్ల అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి కమ్యూనిస్టు ఉద్యమాల ఆవశ్యకత ఉందన్నారు. ఉద్యమాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మోదీ తెచ్చిన మూడు నల్ల సాగుచట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. సీపీఐ ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ కమ్యూనిస్టులు బలహీనపడితే దేశానికి ప్రమాదమన్నారు. దివి తాలుక ప్రాంతంలో 3,500 ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనచరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందని గుర్తు చేశారు. చట్టసభలలో పేద ప్రజల గొంతు వినిపించేది కమ్యూనిస్టులేనని, అలాంటి నాయకులను చట్టసభలకు పంపాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని కోరారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చియ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలను తమ కళల ద్వారా సామాన్యులకు చేరవేయడంలో ప్రజానాట్యమండలి కళాకారులుగా రావి బాబురావు, అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు శక్తి వంచన లేకుండా కృషి చేశారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, పాలడుగు రత్నబాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, నాయకులు హనుమానుల జగన్‌మోహన్ రావు, నజీర్, శర్మ, మల్లుపెద్ది రత్నకుమారి, నక్కా శ్రీనివాసరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, మీర్ రిజ్వాన్ ప్రసంగించారు. తొలుత మృతవీరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి విప్లవ జోహార్లు అర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు ఆహుతులను కట్టి పడేశాయి. హనుమానుల జగన్‌మోహన్ రావు సారధ్యంలో హైదరాబాద్ ప్రగతినగర్‌కు చెందిన కళాకారులు 'రైతే రాజు' నాటికను ప్రదర్శించారు. సీపీఐ నాయకులు లింగం ఫిలిప్, మాలెంపాటి కాంచనరావు, గుత్తికొండ రామారావు, మల్లుపెద్ది బోసు, అల్లూరి బాబురావు, దాసి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

బంధాలపై పవన్ మాట్లాడటమా ?

మాజీమంత్రి పేర్ని నాని మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : బంధాల గురించి పవన్ కల్యాణ్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య,(నాని) విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం వల్ల మేలు జరిగిన ప్రతి కుటుంబం, ప్రతి వైసీపీ కార్యకర్త శ్రీకృష్ణుడిలా తనకు అండగా ఉండి నడిపించమని సీఎం జగన్ కోరుతుంటే, రాబోయే కురుక్షేత్రంలో కుట్రలు, కుతంత్రాలతో కూటములు కట్టి మందిగా వస్తున్న కౌరవులను మట్టికరిపించడానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ, కుటుంబ బంధాలు, మానవసంబంధాలు గురించి కుటుంబం జీవితం గురించి పవన్ కల్యాణ్ దగ్గర నేర్చుకోవడం కంటే హాస్యాస్పదం ఏముంది? అని ప్రశ్నించారు. చిరంజీవికి తోడపుట్టి ఆయనను ఎంతగానో పవన్ అవమానించారన్నారు. చంద్రబాబుకు, మోదీకి ఓట్లు వేయండి, కాంగ్రెస్ పార్టీని నాశనం చేయండని పవన్ మాట్లాడితే చిరంజీవి ఏం చేయలేకపోయారని... చిరంజీవి తలదించుకునేలా వ్యవహరించిన పవన్ బంధాల గురించి మాట్లాడటమా అని ప్రశ్నించారు. అన్నతో విభేదించి, అన్న శత్రువులతో చేతులు కలిపి పవన్ విమర్శిస్తున్నారని మండిపడ్డారు. జనసైకోలు చిరంజీవిని దూషించినప్పుడు పవన్ కల్యాణ్ నోరు ఏమైందనీ, ఇవాళ సన్నాయి నొక్కులు, పత్తిత్తు కబుర్లు చెబుతున్నాడని మండిపడ్డారు. జగన్ అసత్యాలు, అబద్ధాలు మాట్లాడతాడని జంపింగ్ జపాంగ్ బాలశౌరి నోటికొచ్చినట్లు మాట్లాడాడని దుయ్యబట్టారు. మా మచిలీపట్నం ఎంపీ దేనికి సిద్ధం?, పారిపోవడానికి సిద్ధమా? అని ప్రశ్నించారు. పెత్తందారీ మనస్తత్వం ఉన్న చంద్రబాబుకు రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో ప్రజలు గుణపాఠం నేర్పాలన్నారు.

సీఎస్‌ను కలిసిన అర్జున అవార్డు గ్రహీత అజయ్

విశాలాంధ్ర-విజయవాడ: అర్జున అవార్డు గ్రహీత, అంధుల భారత క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్ కుమార్ రెడ్డి మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎస్... అజయ్ కుమార్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తూ రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గుంటూరు జిల్లా గురజాలకు చెందిన అజయ్ 2002 నుంచి జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో అంధుల క్రికెట్ టీమ్‌లో క్రీడాకారునిగా ఆడారు. అనంతరం 2010 నుంచి ఇండియన్ స్క్వాడ్‌గాను, 2016 నుంచి అంధుల భారత క్రికెట్ టీం కెప్టెన్‌గా ఉన్నారు. అజయ్ కెప్టెన్సీలో భారత జట్టు 2017, 2022లో రెండు సార్లు అంధుల టీ-20 ప్రపంచ కప్ సాధించింది. అలాగే 2018లో వన్డే ప్రపంచ కప్‌ను సాధించింది. 2016లో ఆసియా కప్, 2023లో ఐబీఎస్ఏ ప్రపంచ క్రీడల్లో రజత పతకాన్ని సాధించారు. అంతేకాకుండా 18 టోర్నమెంట్లకుగాను 13 మాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు సాధించారు. 2012లో ఇంగ్లాండ్‌లో జరిగిన అంధుల క్రికెట్ టోర్నమెంట్‌లో 33 బంతుల్లో సెకండ్ ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన క్రీడాకారునిగా అజయ్ కుమార్ రెడ్డి రికార్డుల్లో నిలిచారు.

అంతా బటన్ నొక్కుడేనా..? కేఎస్ లక్ష్మణరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గవర్నర్ ప్రసంగంలోని 22 పేజీలు బటన్ నొక్కుడుకు చెందినవే ఉన్నాయని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు విమర్శించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంపై ధన్యవాదాలను తెలుపుతూ మంళవారం శాసన మండలిలో వైసీపీ సభ్యులు మర్రి రాజశేఖర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అదే సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలంటూ టీడీపీ సభ్యులు అడ్డుతగిలారు. లక్ష్మణరావు మాట్లాడుతూ, అభివృద్ధిలో బటన్ నొక్కుడు ఒక భాగం మాత్రమేనని, అభివృద్ధి అంటే... పరిశ్రమలు రావాలని, ఉపాధి కల్పించాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించాలని సూచించారు. వైసీపీ ఎమ్మెల్సీ పండుగుల రవీంద్రబాబు మాట్లాడుతూ, బీజేపీ కార్యకలాపాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ, గవర్నర్ ద్వారా అబద్ధాలను చదివించారన్నారు. కల్పలతారెడ్డి మాట్లాడుతూ, పేదలు అభివృద్ధి చెందాలనే ఆశయంతోనే సీఎం జగన్ ఆలోచన, ప్రతి అడుగు ఉందని చెప్పారు. వైసీపీ సభ్యులు వరుదు కల్యాణి మాట్లాడుతూ, 56 నెలలుగా జగన్ పరిపాలన సాగించి, అనేక సంస్కరణలు, అభివృద్ధి తీసుకొచ్చారన్నారు. మేనిఫెస్టోకు క్రెడిబిలిటీని తెచ్చి దేశంలోనే రాష్ట్రం ప్రథమంగా నిలిచేలా చూశారని, ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని గవర్నర్ ప్రసంగం ద్వారా ప్రజలు గమనించారన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో టీడీపీ సభ్యులు నిరసన తెలిపి, బహిష్కరించడాన్ని ఆమె తప్పుపట్టారు.

ఉపాధ్యాయ పోస్టులు పెంచండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య పెంచాలని పీడీఎఫ్ సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు తదితరులు శాసన మండలిలో వాయిదా తీర్మానం ఇవ్వగా, దీన్ని మండలి చైర్మన్ కొయ్యే మోషెన్ రాజు తిరస్కరించారు. అనంతరం పీడీఎఫ్ సభ్యులు మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క డీఎస్సీ నిర్వహించలేదని, 20 వేలకుపైగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిది జిల్లాల్లో ఎస్జీటీ పోస్టులను జీరోగా చూపించారన్నారు. అటు నిత్యావసర ధరల పెరగుదలను నిరసిస్తూ టీడీపీ సభ్యులు అనురాధ తదితరులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. అనంతరం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సభ్యులు మర్రి రాజశేఖర్ ప్రవేశపెట్టారు.

ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించండి

సీఎం వేడుకోలు సభలో రాష్ట్ర జేఏసీ వినతి

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 1993 ముందు నుంచి పనిచేస్తున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని రాష్ట్ర సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఎన్ఎంఆర్, టైంస్కేల్, ఫుల్ టైం-పార్ట్ టైం కాంటినెంట్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద జరిగిన సీఎం వేడుకోలు సభ జరిగింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బి. సురేశ్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, 2019లో వైసీపీ మేనిఫెస్టోలో (సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం) సర్వీసులు రెగ్యులరైజ్ చేయాలని, 10 సంవత్సరాల సీనియారిటీ ప్రకారం (కాంట్రాక్ట్ విధానం రాకముందు) పర్మినెంట్ చేయాలని, 30 సంవత్సరాలు పూర్తి అయినా కుటుంబాలకు జీవనభిక్ష ద్వారా సర్వీసులు రెగ్యులర్ చేయాలని, 11వ పీఆర్సీ అమలు ఒప్పందం ప్రకారం శాశ్వత ఉద్యోగులుగా పరగణించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఏపీ ఎన్జీవో అండ్ గెజిటెడ్ ఆఫీసర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వి. శివారెడ్డి మాట్లాడుతూ, తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు పాండురంగారావు, ఐఎఫ్‌టీయూ నాయకుడు కిషోర్ మద్దతునిచ్చారు. బి. సుబ్బారావు, కె. రఘునందన్, బెంజిమెన్, సుబ్బారావు, వివిధ విభాగాలకు చెందిన రాష్ట్ర, జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ ఫలాలు

డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి...

శాసన మండలిలో మంత్రి ఆదిమూలపు సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పార్టీలకు అతీతంగా వైసీపీ ప్రభుత్వం అందరికీ సంక్షేమ ఫలాలు అందించిందని, అవి టీడీపీ వారికీ దక్కాయని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ చెప్పారు. శాసనమండలిలో ఏపీ అడ్వకేట్స్ సవరణ బిల్లును మంత్రి ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కుప్పం నుంచి అన్ని నియోజకవర్గాలను పరిశీలిస్తే సంక్షేమ ఫలాలు ప్రజలకు దక్కాయా? లేదా? అనేదీ తెలుస్తుందన్నారు. మనమే మంత్రులుగా ఉండటం కాదని, మన పక్కన తిరిగే ఎమ్మెల్యేలూ మంత్రులుగా ఎదగాలని, అదే సామాజిక సాధికారిత అని అన్నారు. ఆ దిశగా సీఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో అణగారిన వర్గాల కోసం కృషి చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోనూ పాఠశాలలను అద్భుతంగా అభివృద్ధి చేశామని స్పష్టంచేశారు. జగన్ ప్రజా సంకల్పం పాదయాత్ర ద్వారా అనేక సమస్యల్ని గమనించి నవత్నాలను తీసుకొచ్చారన్నారు. కుల, మత, ప్రాంత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను డీబీటీల ద్వారా అందజేసినట్లు వివరించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయనున్నామన్నారు. నాడు చంద్రబాబు హయాంలో అవగాహన రాహిత్యంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించడంతోనే సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. రూ.308 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లను ఏర్పాటు చేశామని, లక్షలాది మంది మత్స్యకారులకు జీవనోపాధిని కల్పించామన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు వైద్యసేవలందించేందుకు 104, 108 వాహనాలు, 10,132 డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు తీసుకొచ్చామని వివరించారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తోందని, ఇందులో ఐదు వైద్యకళాశాలలు పూర్తయినట్లు పేర్కొన్నారు.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ఆవుల శేఖర్ విజ్ఞప్తి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా ఈనెల 16న చేపట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి సమావేశం స్థానిక అంబికా రెస్టారెంట్ పక్కన ఉన్న ఎస్వీఎస్ డార్మిటరీ సమావేశ మందిరంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఆవుల శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, ఉప కార్యదర్శి ఆర్.వెంకట్రావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంత రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆవుల శేఖర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను సంక్షేమ పథకాల పేరుతో మోసం చేస్తున్నాయని, దేశంలో మోదీ అధికారం చేపట్టిన తర్వాత ఏ వర్గమూ అభివృద్ధి చెందలేదని విమర్శించారు. ఎంతో పోరాటం చేసి సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చాలని ప్రయత్నిస్తే ఆ చర్యలను ఉద్యమాల ద్వారా తిప్పికొట్టామని తెలిపారు. ఉపాధి పథకం కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన తండ్రి రాజశేఖర రెడ్డి నియమించిన కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలో గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశ దారిద్ర్యాన్ని పోగొట్టాలంటే దున్నేవాడికే భూమి ఇవ్వాలని, ప్రతి పేదవాడికి సాగు భూమిని పంచాలన్నారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం కలిసి ప్రత్యక్ష భూ ఉద్యమాల ద్వారా పేదలకు భూములు పంచాయని, అయితే ఆ భూములకు కనీసం పట్టాలివ్వడం లేదని విమర్శించారు. ఉప కార్యదర్శి ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజల్లో మత, ప్రాంతీయ, కుల బేధాలు తీసుకువస్తూ, ప్రజలను వేరు చేసి పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. మోదీ పాలనలో ఇప్పటివరకు రూ1.68 లక్షల కోట్ల అప్పు చేయడంతో దేశంలోని 140 కోట్ల జనాభాకు కోటి రూపాయల చొప్పున అప్పు ఉందని ఎద్దేవా చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ మోదీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదన్నారు. మతానికి, రాజకీయానికి ముడిపెడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా దోపిడీ కనిపిస్తోందని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంత రావు మాట్లాడుతూ జిల్లాలో అనేక భూ సమస్యలు ఉన్నాయని, ప్రజల పక్షంగా నిరంతరం పోరాడతామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణ రాజు, జిల్లాలోని ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సీపీఎం రాష్ట్ర కమిటీ రెండు రోజుల సమావేశాలు ముగిశాయి. విజయవాడలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో రెండో రోజైన మంగళవారం జరిగిన సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన వహించారు. ఈ సమావేశానికి పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ.బేబి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈనెల 16 కార్మిక సంఘాలు, రైతు సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త నిరసనో ద్యమానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతూ తీర్మానించింది. వాహనాల ఫిట్‌నెస్ ప్రక్రియ ప్రైవేటీకరణను, వాహన దారులపై భారాలను వ్యతిరేకించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కుని రవాణ శాఖ ద్వారా వాహనదారులపై భారీగా భారాలు వేస్తున్నారని, ఫిట్‌నెస్(బ్రేక్) సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను జిల్లాల వారీగా బడా కంపెనీలకు కట్టపెట్టేందుకు టెండర్లు పిలవడం సిగ్గుచేటని సమావేశం తప్పుపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వటం, రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోవడం శోచనీయమని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయటానికి చెల్లించాల్సిన ఫీజులను భారీగా పెంచుతూ ఆదేశాలు ఇవ్వడాన్ని తప్పు పట్టింది. ద్విచక్ర, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పరిధిలోకి తీసుకురాకుండా నివారించాలని, గతంలో ఉన్న పద్ధతే కొనసాగించాలని, టెండర్లు రద్దు, భారీగా పెంచిన ఫీజులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చింది. 2020-21వలో ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా మద్దతు ధరల చట్టాన్ని తీసుకువస్తామని, విద్యుత్ సవరణ బిల్లుపై రైతు సంఘాలతో చర్చించిన తర్వాత పార్లమెంటులో ప్రవేశ పెడతామని ఇచ్చిన హామీని కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేసింది.

సంపాదకీయం

మాటలకే పరిమితమైన న్యాయం

గత వారం జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికలలో ఎన్ని అక్రమాలు జరిగాయో చూపే వీడియోలు దేశమంతటా చూసి తరించిన తరవాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ కూడా కోర్టులోనే ఆ వీడియో చూసి ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడాన్ని సమర్థించబోం అని హుంకరించారు. ఈ ఎన్నికకు సంబంధించిన సకల పత్రాలు, వివరాలు కోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు సాయంత్రం అయిందింటిలోగా అప్పగించాలని సోమవారం ఆదేశించారు. చండీగఢ్ మేయర్ ఎన్నికలను నిర్వహించిన అనిల్ వసీ కెమెరా కళ్ల ముందే కార్పొరేషన్ సభ్యులందరి సమక్షంలోనే బ్యాలెట్ పేపర్ల మీద ఏదో రాశారు. తరవాత అవి చెల్లవని ప్రకటించారు. బీజేపీ అభ్యర్థి సోంకర్ గెలిచారని, ఆమ్‌ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కుల్దీప్ సింగ్ ఓడిపోయారని ప్రకటించారు. ఎన్నికల అధికారి బ్యాలెట్ పత్రాలను విరూపం చేశారని, ఆ పని చేస్తున్నప్పుడు పదే పదే కెమెరాలకేసి ఏదో దొంగ పని చేస్తున్నట్టు చూశారనీ, ఎన్నికలు నిర్వహించే తీరు ఇదేనా, ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంపాలు చేయడమేనని, ఎన్నికల అధికారిపై చట్ట రీత్యా చర్య తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు. అనిల్ వసీ బీజేపీతో సన్నిహిత సంబంధం ఉన్న వ్యక్తి. ఆయనను ఎన్నికల అధికారిగా నియమించడమే ఒక అక్రమం. అధికార యంత్రాంగం బీజేపీ ముందు మోకరిల్లిందనడానికి నిదర్శనం. మేయర్ ఎన్నికలలో జరిగిన అక్రమాలకు సంబంధించిన వీడియో చూసిన తరవాత ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహోదగ్రులయ్యారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం సహించబోమని చెప్పారు. నిజానికి ఆ మేయర్ ఎన్నిక అప్పటికే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేసింది. ఎనిమిది బ్యాలెట్ పేపర్ల మీద ఏదో రాసేసి అవి చెల్లవని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన అనిల్ వసీ ప్రకటించడమే ప్రజాస్వామ్యాన్ని బాహాటంగా ఖూనీ చేయడం. బ్యాలెట్ పేపర్ మీద ఓటర్లు పెట్టే గుర్తు తప్ప మరేమీ ఉండకూడదు. ఇంతటి అక్రమానికి పాల్పడగలిగిన వ్యక్తి కనకే అనిల్ వసీని ఎన్నికల అధికారిగా నియమించారని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ మోసం గురించి ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ నాయకులు ముందు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కనీసం తాత్కాలిక ఉపశమనం అయినా ఇవ్వకుండా మూడు వారాలు వాయిదా వేయడంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్లింది. అన్ని రికార్డులు అప్పగించాలని ఆదేశించిన సుప్రీంకోర్టు రెండు వారాల తరవాత అంటే వచ్చే 19వ తేదీకి వాయిదా వేసింది. ఇదంతా చూస్తే ప్రజాస్వామ్యం మంట గలిసిందని, వేసిన ఓటుకు ఎలాంటి విలువ, రక్షణ లేదని తేలిపోయింది. ఎన్నికలలో అక్రమాలు కొత్త కాదు. ఎన్నికల సంస్కరణలకోసం ఏర్పాటు చేసిన దినేశ్ గోస్వామీ కమిటీ నివేదిక, ఇంద్రజిత్ గుప్తా కమిటీ నివేదిక ఎన్నడో అటకెక్కాయి. రాజ్యసభకు ఎన్నికైన సంజయ్ సింగ్ పార్లమెంటు సభ్యుడిగా ప్రమాణం స్వీకరించవచ్చు అని న్యాయస్థానం చెప్పినా ఆయనను ఆ పని చేయనివ్వడంలేదు. ఇదీ ప్రజాస్వామ్యాన్ని మంటగలపడమేగా! దీని మీద న్యాయస్థానం ఎప్పుడు ఏం చర్య తీసుకుంటుందో వేచి చూడక తప్పదు. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఇన్ని అక్రమలు జరిగితే ఎన్నికల కమిషన్ మౌనంగా ఉంటోందంటే ఆ వ్యవస్థ ఎంత నిర్వీర్యం అయిందో తెలుస్తూనే ఉంది. పరీక్ష పత్రాలు వెల్లడి కావడం, పరీక్షల్లో విద్యార్థులు పుస్తకాలు చూసో, పక్కవాడిని చూసో రాయడాన్ని కట్టడి చేస్తూ మంగళవారం లోకసభలో ఒక బిల్లు ఆమోదించారు. ఈ కట్టడి లాంటివి ఎన్నికల వ్యవస్థలో లోపాలను సరిదిద్దడానికి ఎందుకు జరగవో అంతుపట్టదు. అయినా బీజేపీ అధికారంలో ఉండగా ప్రజాస్వామ్యం బతికి బట్టకడ్తుందని అనుకోవడమే పెద్ద భ్రమ.

సుప్రీంకోర్టులో సోమవారం విచారణ సందర్భంగా సోలిసిటర్ జనరల్ మీరు వీడియోలో చూసింది ఒక పక్షానికి సంబంధించిందే కనక రెండో పక్షం వాదనా వినాలని వాదించడం అమాయకత్వం కాదు. ప్రభుత్వంతో కుమ్మక్కై ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించడంలో భాగం. సుప్రీంకోర్టు ఆయనను మందలించకపోవడం గమనార్హం. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయ మూర్తులు మొన్న మొన్నటిదాకా ఉద్యోగ విరమణ చేసినప్పుడు జరిగే వీడ్కోలు సభలో వ్యవస్థలోని లోపాలు ఎత్తి చూపేవారు. ఇప్పుడు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ కోర్టు హాలులోనే కాక ఇతర చోట్ల మాట్లాడినప్పుడు లోపాలను బాహాటంగానే ఎత్తి చూపుతున్నారు. న్యాయమూర్తులు చెప్పే సూక్తులు విచారణ సందర్భంగా చేసే వ్యాఖ్యలకే పరిమితం అవుతున్నాయి. తీరాచూస్తే ఇచ్చే తీర్పులు నిరాశ కలిగిస్తున్నాయి. మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే మోసపూరితంగా ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పుడూ ప్రధాన న్యాయమూర్తి గవర్నర్ వ్యవహార సరళిని తప్పుపట్టారు. ఆయన మీద ప్రతికూల వ్యాఖ్యలు మాత్రం చేయలేదు. ఉద్ధవ్ ఠాక్రే కనక బలపరీక్షకు వెళ్లకుండా రాజీనామా చేసి ఉండకపోతే ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా నియమించే వాళ్లం అని చంద్రచూడ్ అన్నారు. అయినా అక్రమంగా అధికారం సంపాదించిన షిండే పదవిలో కొనసాగుతూనే ఉన్నారు. ఈ అక్రమాన్ని నిరోధించడానికి సుప్రీంకోర్టు చేసింది శూన్యం. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ హైకోర్టుకు వెళ్తే అక్కడ న్యాయం జరగలేదు. కనీసం తాత్కాలిక ఉపశమనం అయినా కలగలేదు. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ కోర్టు హాలులో ఎంత ఆగ్రహించినా తాత్కాలిక ఉపశమనమైనా కలిగించలేదు. కనీసం అక్రమంగా ఎన్నికైన మేయర్ ఆ పదవిలో కొనసాగకూడదన్న ఆదేశమైనా జారీ చేయలేదు. మోసపూరితంగా ఎన్నికైన మేయర్ ఒక్క రోజు ఆ పదవిలో కొనసాగినా ప్రజాస్వామ్యం ఖూనీ అయినట్టే కదా. హైకోర్టును అభిశంసించిన సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేయడం తప్ప న్యాయం మాత్రం చేయలేదు. నిజానికి బందిపోటు లాంటి చర్యతో ఎన్నికల అధికారి సహాయంతో ఎన్నికైన మేయర్‌ను తక్షణం కుర్చీలో పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అవహాస్యం చేయడమే. చండీగఢ్ మేయర్ ఎన్నిక చెల్లదని ప్రకటించాల్సింది. అదీ చేయలేదు. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పిటిషనర్లు అడిగింది కూడా ఆ ఎన్నికను రద్దు చేయమనే. హైకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో మళ్లీ ఎన్నిక జరిపించాలని ఆ పిటిషన్‌లో కోరారు. అదీ జరగలేదు. విచారణను వాయిదాలు వేస్తూపోతే ఇలాంటి అక్రమాలను అరికట్టడం సాధ్యం కాని పని. ఎన్నికల బాండ్ల కేసును చాలా జాప్యం తరవాత విచారించింది. తీర్పును వాయిదా వేసింది. తీర్పు ఎప్పుడొస్తుందో తెలియదు. ఈ లోగా మోదీ ప్రభుత్వం మరో విడత ఎన్నికల బాండ్లను జారీ చేసి బీజేపీ ఖజానా నింపేసింది. మొత్తం మీద చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ వ్యవహారంలో ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహం ఎంత తీవ్రమైంది అయినా తీర్పు ఏ రూపంలో ఉంటుందోనన్నదే ప్రధానం. న్యాయమూర్తుల తీవ్ర వ్యాఖ్యలు బోలెడు ఆశలు రేకెత్తిస్తే తీర్పులు నిరాశ పరుస్తున్నాయన్నది మాత్రం వాస్తవం.

సర్వం ఇంటర్నెటే!

నేడు అంతర్జాలం లేకుండా క్షణం గడవదు. ఇంటర్నెట్ సిగ్నల్ అందకపోతే ఊపిరి ఆగిపోయినట్లు తోస్తున్నది. 8 బిలియన్స్‌కు పైగా ప్రపంచ మానవాళిని క్షణాల్లో ఏకం చేయగల సామర్థ్యం అంతర్జాలానికి మాత్రమే ఉంది. 'నెట్ వర్క్ ఆఫ్ నెట్‌వర్క్'గా పిలుస్తున్న ఇంటర్నెట్ ద్వారా ప్రపంచ నలుమూలల ఉన్న కంప్యూటర్లను అనుసంధానం చేస్తూ ప్రామాణిక సమాచార వితరణ సాధనంగా క్షణాల్లో ఒకరి నుంచి మరొకరికి సమాచారాన్ని చేరుస్తున్న మహత్తర శక్తివంతమైన మాధ్యమంగా అంతర్జాలం లేదా ఇంటర్నెట్ మానవాళితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకుంది.

అంతర్జాలం నేడు కనీస అవసరాల జాబితాలో ప్రథమ స్థానంలో నిలుస్తున్నది. అన్నం, నీరు లేకుండా బతకవచ్చేమోగాని ఇంటర్నెట్ కనెక్ట్ అయిన స్మార్ట్‌ఫోన్ లేకుండా క్షణం కూడా గడవడం లేదు. అంతర్జాల వేదికగా ఈ-మెయిల్స్, ఎస్ఎంఎస్/వాట్సాప్ మెసెజ్‌లు, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, లింక్‌డిన్, వీడియో చాట్స్, ఫైల్స్ నిర్వహణ, డాటా స్టోరేజ్, ఆర్థిక లావాదేవీలు, జూమ్ వేదికల్లో సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, గూగుల్ మ్యాపింగ్, లొకేషన్ నిర్ధారణలు, స్మార్ట్‌ఫోన్ వినియోగాలు, సమాచార శోధనలు, ఆన్‌లైన్ చాటింగ్, ఫైల్స్ బదిలీలు, ఆధునిక టెక్నాలజీ ఆకళింపు ప్రయోజనాలు, వెబ్‌సైట్ నిర్వహణలు, ఆన్‌లైన్ షాపింగ్, ఆన్‌లైన్ విద్య, వినోద వితరణ లాంటి అపరిమిత అమూల్య పర్యావరణహిత ప్రయోజనాలు మానవాళి కొనవేళ్ల నొక్కడంతో మన ముంగిటికి తీసుకువస్తున్నది. పూర్తి అవగాహన లేకుండా అంతర్జాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సంబంధించిన సమాచారాన్ని సామాన్యులకు చేరవేయడానికి 'సురక్షిత అంతర్జాల దినం(సేఫర్ ఇంటర్నెట్ డే)' వేదికలను వినియోగిస్తున్నారు. సురక్షిత అంతర్జాల దినం - 2024 నినాదంగా 'మెరుగైన అంతర్జాలం కోసం అందరం కలుద్దాం (టుగెదర్ ఫర్ ఏ బెటర్ ఇంటర్నెట్)' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. అంతర్జాల ప్రయోజనాలు విద్యాలయాలు, కార్యాలయాలు, పరిశ్రమలు, నడవాణిజ్య వ్యాపార సంస్థలు, ప్రభుత్వ పాలనలు, గృహ సంబంధ ప్రయోజనాలు లాంటి రంగాలకు విస్తృతంగా విస్తరించడం చూస్తున్నాం.

అంతర్జాల దుర్వినియోగం, సైబర్ నేరాలు:

అంతర్జాల వినియోగం మానవాళి శ్రేయస్సుకు వరంగా మారి ఊతం ఇవ్వాలని, ఇంటర్నెట్ వాడకంతో మోసాలు/అక్రమాలకు తావివ్వకూడదని విస్తృతంగా ప్రచారం చేయడానికి ప్రతి ఏట 06 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు 'సురక్షిత అంతర్జాల దినం (సేఫర్ ఇంటర్నెట్ డే)' నిర్వహించడం ఆనవాయితీగా మారింది. అంతర్జాల వలలో పిల్లలు, యువత, పెద్దలు, అన్ని వర్గాల ప్రజలు మునిగి తేలుతున్నారు. అంతర్జాలాన్ని దుర్వినియోగం చేయడంతో ఇంటర్నెట్ మోసాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. సైబర్ నేరాల్లో సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ అడిక్షన్, తప్పుడు సమాచార వితరణ, వ్యక్తిగత సమాచార చోరీ, సమాచార/నగదు దోపిడీ, సైబర్ మోసాలు, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల రవాణా, అశ్లీల వెబ్‌సైట్లు, చట్టవిరుద్ధ కార్యాలు/సేవలు, ఏఐ ఆధారిత డీప్ ఫేక్ వీడియోలు లాంటి వివిధ అంశాలు వస్తాయి. దీనికి తోడుగా అంతర్జాల దురలవాటుతో మానవ సంబంధాలు సన్నగిల్లడం, ఈర్ష్యాద్వేషాలు పెరగడం, విభేదాల సంక్షోభాలు అంకురించడం, అభద్రతాభావం పెరగడం, ఆందోళన, మూడ్ స్వింగ్, మానసిక ఒత్తిడి పెరగడం, ఒంటరితనం వెంటాడడం, ఏకాగ్రత తగ్గడం, పనిలో శ్రద్ధ కోల్పోవడం లాంటి అనేక ప్రతికూలతలు కూడా ఉన్నాయని గమనించాలి.

పూర్తి పరిజ్ఞానం లేకుండా ఇంటర్నెట్ వేదికలను వినియోగిస్తే మనకు తెలియకుండానే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవలసి వస్తుందని తెలుసుకోవాలి. అంతర్జాలం పట్ల కనీస అవగాహన కలిగి ఉండడం, పరిమితులను తెలుసుకోవడం, సైబర్ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండడం, ఆన్‌లైన్ సేఫ్ టూల్స్ గురించి తెలుసుకోవడం, సైబర్ నేరాల పట్ల సమాజాన్ని జాగృత పరచడం, వ్యక్తిగత సమాచారాన్ని భద్రపరుచుకోవడం లాంటి అనేక జాగ్రత్తలు ప్రతి ఒక్క ఇంటర్నెట్ వినియోగదారుడికి తెలిపే పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని అంతర్జాల నిపుణులు పేర్కొంటున్నారు. కనీస ఆన్‌లైన్ అవగాహనలతో సురక్షితమైన అంతర్జాల అనంత అద్భుత ప్రయోజనాలను ఆశ్వాదిద్దాం, విశ్వ మానవాళితో అనుసంధానంలో ఉందాం.

దా: బుర్ర మధుసూదన్ రెడ్డి

రక్తపు మరకల రథయాత్రికుడికి భారత రత్న!!

ఆర్వీ రామారావ్

టిప్పణి

భారత రత్న అవార్డులు 1954 నుంచి ఇవ్వడం మొదలైనప్పటి నుంచీ వివాదాలకు కొరతే లేదు. ఈ సారి మోదీ ప్రభుత్వం మొదట ఇతర వెనుకబడిన తరగతుల నాయకుడు కర్పూరీ ఠాకూర్‌కు ఈ సత్కారం ప్రకటించింది. ఆ తరవాత పునరాలోచించి బీజేపీ అగ్ర నాయకుడు లాల్‌కృష్ణ అద్వాణీకీ ఇస్తామని ప్రకటించింది. సహజంగానే ఇది తీవ్ర వివాదం రేపింది. మరణానంతరం ఈ సత్కారం పొందిన వారూ 17 మంది ఉన్నారు. సుదీర్ఘ కాల బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్న సీపీఎం నాయకుడు జ్యోతిబసు సజీవంగా ఉండగానే ఆయనకు భారత రత్న ఇవ్వాలని బెంగాల్ సీపీఎం ప్రభుత్వమే సిఫార్సు చేసింది. కానీ ఇచ్చినా తిరస్కరిస్తానని జ్యోతిబసు తెగేసి చెప్పారు. ఈ సత్కారం పొందిన వారిలో నెల్సన్ మండేలా, మదర్ థెరీసా విదేశీయులు. మొదట క్రీడాకారులకు ఈ సత్కారం ఇచ్చే వారు కాదు. కానీ మొదటిసారి ఈ సత్కారం పొందిన క్రీడాకారుడు సచిన్ తెండూల్కర్.

శివసేన ఒకప్పుడు వీర సావర్కర్‌కు భారత రత్న ఇవ్వాలని కోరింది. స్వాతంత్ర్య సమర యోధులకే ఈ అవార్డు ఇస్తారని కాదు గానీ సంఘ్ పరివార్‌లో స్వాతంత్ర్యోద్యమంతో సంబంధం ఉన్న ఏకైక వ్యక్తి సావర్కర్. హిందుత్వ సిద్ధాంతానికి పటిష్ఠమైన పునాదులు వేసిందీ ఆయనే. కానీ హిందుత్వ విధానాలను ఓట్ల కింద మార్చే ఉపాయం కనిపెట్టింది మాత్రం కచ్చితంగా అద్వాణీయే. మోదీ నాయకత్వంలో ప్రస్తుతం హిందుత్వ జోరుగా సాగుతున్నా అద్వాణీకి ఇవ్వడంపై బోలెడు విమర్శలు తలెత్తాయి. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత ఏడుగురికి భారత రత్న ప్రకటిస్తే అటల్ బిహారీ వాజపేయి, నానాజీ దేశ్ ముఖ్, అద్వాణీ హిందుత్వ కుదురులోంచి వచ్చిన వారే. మదన్ మోహన్ మాలవీయకు మొదటి నుంచీ హిందుత్వ వేపు మొగ్గు ఉంది. ప్రణబ్ ముఖర్జీ ఆర్.ఎస్.ఎస్. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై తాను హిందుత్వ వ్యతిరేకిని కానని నిరూపించుకున్నారు. అద్వాణీకి భారత రత్న ఇవ్వడాన్ని వ్యతిరేకించే వారి సంఖ్య అపారంగానే ఉండొచ్చు. కానీ ఆయనకు ఎందుకు ఇస్తున్నారో మోదీ మాటలను గమనించడం అవసరం. ప్రజాస్వామ్యాన్ని ఒక పార్టీ గుప్పిట నుంచి, అందునా ఒక కుటుంబం ఉక్కు పిడికిలి నుంచి విడిపించిన అద్వాణీకి ఈ సత్కారం అందజేస్తున్నామని మోదీ చెప్పారు. దేశాభివృద్ధికి అద్వాణీ ఎనలేని కృషి చేశారట. పార్లమెంటులో అద్వానీ ఎప్పుడు మాట్లాడినా విలక్షణంగా, అంతర్దృష్టి ఉండేదని, రాజకీయాల్లో నైతికత ప్రవేశ పెట్టారనీ మోదీ అన్నారు. దేశ ఐక్యతను, సాంస్కృతిక పునర్వికాసానికి అద్భుతమైన కృషి చేశారని కొనియాడారు. ఇందులో కొంత వాస్తవమే. సాంస్కృతిక పునర్వికాసానికి అద్వాణీ కృషి సంఘ్ పరివార్‌కు గొప్పగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. కానీ హిందుత్వాన్ని రాజకీయ ప్రయోజనాలకు, ఎన్నికలలో ఓట్ల సంపాదనకు ఎలా వినియోగించుకోవచ్చో మొదట ఆచరణలో రుజువు చేసింది కచ్చితంగా అద్వాణీయే. మోదీ ఆ బాటలో పరుగులు పెడ్తున్నారు.

నిస్సందేహంగా మోదీకి రాజకీయాలలో అసలైన గురువు అద్వాణీయే. 2002లో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన మారణ కాండలో కనీసం 2000 మంది మరణించారు. వీరిలో ఎక్కువ మంది ముస్లింలేనని చెప్పక్కర్లేదు. అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్న అటల్ బిహారీ వాజపేయి మోదీని ముఖ్యమంత్రి స్థానం నుంచి తొలగించాలనుకున్నారు. పాలకులు రాజ ధర్మాన్ని పాటించాలని హితవూ చెప్పారు. అయితే అద్వాణీ మాత్రం మోదీని తొలగించకుండా అడ్డుపడ్డారు. ఆ గౌరవమూ మోదీకి ఉన్నందువల్ల ఇచ్చారని చెప్పడానికీ అవకాశం లేదు. ఎందుకంటే మోదీ అధికారంలోకి రాగానే అద్వాణీ, మురళీ మనోహర్ జోషి, జస్వంత్ సింగ్‌ను మార్గదర్శక మండల్‌లోకి తోసేసి అడ్డు తొలగించుకున్నారు. వెనుకబడిన తరగతుల వారికి మొట్ట మొదట రిజర్వేషన్లు కల్పించిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించి మోదీ ఓబీసీ రాజకీయాల ఆవశ్యకత గుర్తించారు. వచ్చే ఎన్నికల్లో ఇదొక్కటే చాలదని గ్రహించిన తరవాత హిందుత్వ రాజకీయాల గురు పీఠంలో ఉన్న అద్వాణీకీ భారత రత్న ఇస్తే తప్ప తన హిందుత్వ రాజకీయాలు ఓట్లు రాల్చవని మోదీ గ్రహించినట్టున్నారు. అద్వాణీ హిందుత్వ పంథాకు ఆయన సోమనాథ్ దేవాలయం నుంచి రథ యాత్ర నిర్వహించడమే ప్రబల ఉదాహరణ. రథ యాత్ర ప్రారంభించడానికి చాలా ముందే హిందుత్వ కోణాన్ని బహిర్గతం చేశారు. అమృతసర్ స్వర్ణ దేవాలయంలో తిష్ఠ వేసిన సిక్కు తీవ్రవాదులను ఏరి వేయడానికి సైన్యాన్ని వినియోగించాలని ఇందిరా గాంధీని ఒత్తిడి చేసినంత పని చేశారు. అప్పుడు బీజేపీ కార్యకర్తలు ఇందుకోసం రోడ్ల మీద ప్రదర్శనలూ చేశారు. ఇందులో అద్వాణీ స్వయంగా పాల్గొన్నారు. స్వర్ణదేవాలయంలోకి సైన్యాన్ని పంపించాలని సూచించింది తానేనని అద్వాణీ సగర్వంగా విపులమైన స్వీయ చరిత "మై కంట్రీ మై లైఫ్"లో విస్తారంగా ప్రస్తావించారు. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ మండల్ నివేదిక దుమ్ము దులిపి ఈ నివేదికను అమలు చేస్తామని పార్లమెంటులో 1990 ఆగస్టు ఏడున ప్రకటించారు. 1990 సెప్టెంబర్ 25న సోమ్‌నాథ్ నుంచి అద్వాణీ రామరథ యాత్రకు శ్రీకారం చుట్టారు. మండల్ కమిషన్ నివేదిక అమలుకు బీజేపీ బద్ధ వ్యతిరేకి. అద్వాణీ ఆత్మకథలో దీనికి ఆధారాలు కనిపిస్తాయి. సోషలిస్టు నాయకుడు జార్జ్ ఫెర్నాండెజ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అద్వాణీ ఎన్నడూ ఈ మాట చెప్పిన ఫెర్నాండెజ్‌ను ఖండించలేదు. పైగా మండల్ సిఫార్సులను వ్యతిరేకించడానికి మందిర్-మసీదు అంశంపై ఆందోళన చేయడం తప్ప తమకు గత్యంతరం లేదని అద్వాణీ స్వయంగా ఫెర్నాండెజ్‌తో అన్నారు. మండల్ ప్రస్తావన లేకపోతే రథయాత్ర ఊసే ఉండేది కాదేమో! పైగా సనాతన ధర్మాన్ని విశ్వసించే సంఘ్ పరివార్‌కు విగ్రహారాధనలో విశ్వాసం లేదు. ఇప్పుడైతే మోదీ కనిపించిన గుళ్లోకి, గురుద్వారాలోకి వెళ్తున్నారు తప్ప వాజ్‌పేయి, అద్వాణీ ఎన్నడూ గుళ్ల చుట్టు తిరగలేదు. విగ్రహారాధనకు సంఘ్ పరివార్ దూరం అని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏముంటుంది? అద్వాణీ రథ యాత్ర సాగిన చోట్ల మాత్రమే కాక ఇతర చోట్ల కూడా మత కలహాలు చెలరేగి కనీసం 500 మంది బలయ్యారు. అంటే అద్వాణీ రథ యాత్ర వెనక కనిపించేవి రక్తపు చారికలే. అద్వాణీ పునరుద్ధరించాలనుకున్న హిందువుల ఆత్మ గౌరవం రక్త చరిత్ర లిఖించింది. ఇంత జరుగుతున్నా రథయాత్రను నిరోధించే సాహసం ఏ రాష్ట్ర ముఖ్యమంత్రీ చేయలేదు. చివరకు అప్పుడు బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న లాలూ ప్రసాద్ యాదవ్ రథయాత్ర బీహార్ లో ప్రవేశించిన తరవాత సమస్తిపూర్‌లో అడ్డుకొవడమే కాక అద్వాణీని అరెస్టుచేసి దిల్లీ పంపించారు. రథ యాత్ర సోమనాథ్ లో ప్రారంభించి నేరుగా అయోధ్యకు వెళ్లడం కాదు. ఆ యాత్ర దారి మళ్లి దేశంలోని అనేక రాష్ట్రాల గుండా సాగింది. రామ మందిర నిర్మాణానికి ఈ యాత్ర పొడవునా జనం ఒక్కో ఇటుకను, కనీసం ఒక్క రూపాయి విరాళం ఇవ్వాలని కోరారు. చాలా మంది ఈ పని చేశారు.

1990లోనే కశ్మీరీ పండితులు తమ సొంత గడ్డను, ఇల్లు ముంగిలి వదిలేసి కశ్మీర్ నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వచ్చింది. కశ్మీరీ పండితులపై హత్యాకాండను అద్వాణీ ఎన్నడూ ప్రశ్నించలేదు. ఖండించలేదు. ఆ సమయంలో రథ యాత్ర ఆపి కశ్మీర్‌కు వెళ్లనూ లేదు. కార్గిల్ దాడి, పార్లమెంటుపై దాడి ఘటనలు అద్వాణీ హోం మంత్రిగా ఉన్నప్పుడే జరిగాయి. అనేక నెలలుగా మణిపూర్‌లో తీవ్ర కలహాలు జరుగుతున్నా మోదీ ఆ రాష్ట్రానికి వెళ్లకపోవడంతో పోల్చి చూసుకుంటే ఇద్దరి "హిందూ ప్రేమ" కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. కరాచీలో ఒక సంపన్న వ్యాపరస్థుల కుటుంబలో జన్మించిన అద్వాణీ 14వ ఏట ఆర్.ఎస్.ఎస్.లో చేరారు. కానీ ఇతర సంఘ్ పరివార్ నాయకులలాగే ఎన్నడూ జాతీయ పోరాటంలో భాగస్వామి కాలేదు. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ ఆయన పాత్ర లేదు. అనేక మంది సింధీలు క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వాములయ్యారు. గాంధీ వ్యక్తిగతంగా చాలా స్వచ్ఛమైన వాడు అని అద్వాణీ పొగిడిన మాట నిజం. కానీ గాంధీని హత్య చేసిన నాథూ రాం గాడ్సే ఆర్.ఎస్.ఎస్. వాడు కాదని అడ్డంగా వాదించారు. ఆయన ఆత్మకథలోనూ ఈ ప్రస్తావన కనిపిస్తుంది. గాడ్సే ముందు ఆర్.ఎస్.ఎస్.లో ఉన్న మాట నిజమే కానీ గాంధీని హతమార్చడానికి 15 ఏళ్లకు ముందే ఆర్.ఎస్.ఎస్. నుంచి వైదొలగారని చెప్పి అద్వాణీ వాస్తవాలను కప్పి పుచ్చారు. ఆయన హిందూ మహాసభకు చెందినవాడని మాత్రం



అంగీకరించారు. తాము ఎన్నడూ ఆర్.ఎస్.ఎస్.కు దూరంగా లేమని గాంధీ హత్యలో భాగస్వామ్యం ఉన్న గాడ్సే సోదరుడు గోపాల్ వినాయక్ గాడ్సే జైలు నుంచి విడుదలైన తరవాత నిర్మొహమాటంగానే చెప్పారు. ఈ వాస్తవాన్ని అద్వాణీ తన ఆత్మకథలో ప్రస్తావించనే లేదు. అద్వాణీకి భారతరత్న ఇస్తే వివాదం చెలరేగుతుందని మోదీకి తెలియక కాదు. హిందుత్వ మరో అడుగు ముందుకు వేస్తే తప్ప 2024 ఎన్నికల్లో గట్టెక్కలేమని ఆయనకు తెలుసు. ఈ వివాదం చెలరేగితే గానీ మోదీ హిందుత్వను సంపూర్ణంగా వినియోగించుకోలేరు. అదీ అసలు విషయం. మోదీకి మండల్ కావాలి, కమండలమూ కావాలి.

స్ఫూర్తినింపిన ఆట...పాట...మాట

పి. చంద్రానాయక్

ప్రపంచ మానవాళిని దోపిడీ నుంచి విముక్తి చెయ్యాలని కలలుగన్న సోషలిస్టు రాజ్య స్థాపకుడు వీఐ లెనిన్ మరణించి 100 వసంతాల సందర్భం ఇది. ఆయన భౌతికంగా సజీవంగా లేనప్పటికీ ఆయన భౌతికకాయం ఈనాటికి మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో ఉంది. పోరాటపటిమ గల ధీశాలి, విశ్వ మానవ ప్రేమికుడు లెనిన్ శత వర్ధంతి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో...శత వర్ధంతి సందర్భంగా విజయవాడలో లెనిన్ విగ్రహం వద్ద వారం రోజులపాటు ప్రజానాట్యమండలి నిర్వహించిన ఆట...పాట కార్యక్రమాలు ఎంతగానో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని కలిగించాయి. జనవరి 21 నుంచి 27వ తేదీ వరకు వారోత్సవంగా నిర్వహించారు. లెనిన్ విగ్రహ ప్రదేశంగల పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. భారీ విగ్రహానికి ఫ్లడ్ లైట్లు, పార్కు చుట్టూ రంగురంగుల లైట్లతో మిరమిట్లు గొలిపే కాంతుల మధ్య విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో మొక్కలు, పూల కుండీలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. తొలిరోజు జనవరి 21వ తేదీ ఉదయం కార్యకలాపాలతో ప్రారంభమై ప్రతిరోజు సాయంత్రం సమయాన ఆటపాట మాట కార్యక్రమాలతో విగ్రహ పరిసర ప్రాంతాలలో పండుగ వాతావరణం ఏర్పడింది. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, వి శ్రీనివాసరావు క్రేన్ పైనఎక్కి గజమాలను మహనీయుడి విగ్రహానికి అర్పించి ఘనమైన నివాళులర్పించారు. వారం రోజుల కార్యక్రమాన్ని రూపొందించ డంలో, విగ్రహ పరిసర ప్రాంతాలను అలంకరించి కార్యక్రమాలను నిర్వహించ డంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ మనోహర్ నాయుడు, ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ లక్ష్మయ్య, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు బుడ్డిగ జమిందార్, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సీపీఎం నగర కార్యదర్శి దోనేపూడి కాశీ విశ్వనాథ్ ప్రముఖ కళాపోషకులు గోళ్ల నారాయణరావు తదితరులు కీలక పాత్ర పోషించారు. సాయంత్రం వేళ జరిగిన సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు పి చంద్ర నాయక్, ఆంధ్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి అనిల్ పర్యవేక్షించారు. 21న ప్రారంభమైన పాట మాట కార్యక్రమం 27వ తేదీ వరకు నిరాటంకంగా స్ఫూర్తిదాయకంగా సాగింది. నిర్వహించిన కార్యక్రమం కొద్దిపాటిదే అయినప్పటికీ లెనిన్ శత వర్ధంతి పురస్కరించుకుని వారం రోజులపాటు విగ్రహం వద్ద ఆటపాట మాట కార్యక్రమం నిర్వహించడం దేశంలో బహుశా ఇక్కడే అయి ఉండవచ్చు. ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగాయి. అనేక మంది మేధావులు, వామపక్ష నేతలు పాల్గొని లెనిన్ మహాశయుడు సాగించిన పోరాటం నేడు దేశంలో, ప్రపంచంలో ఉన్న పరిస్థితులను వివరించారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం మారణహోమం తాండవిస్తుంటే





వాటిని పరిష్కరించకుండా పాలకులు కులం మతం పేరుతో ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి పబ్బం గడుపు గడుపుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల అప్రమత్తత, ప్రజల కర్తవ్యాలను తమ సందేశాల ద్వారా వివరించారు. కళాకారులు తమ ఆటపాటల ద్వారా విభిన్న సమస్యలను స్పృశిస్తూ గేయాలు ఆలపించారు. స్ఫూర్తివంతమైన పోరాటాలను, త్యాగమూర్తుల త్యాగాలను తెలియపరుస్తూ మార్క్సిస్టు లెనిన్ సైద్ధాంతిక అంశాలతో కూడుకున్న అనేక పాటలను కళాకారులు ఆలపించారు. స్కిట్లు, అభ్యుదయ సందేశాత్మక పాటలకు నృత్య ప్రదర్శన రాజకీయ గారడితోపాటు కొంతమంది కవులు సందర్భానుసారం కవితలను వినిపించారు. కళారూపాల ద్వారా ప్రజలను జాగృతం చేశారు. ఉభయ ప్రజానాట్యమండలు లకు చెందిన 15 నుంచి 20 మంది వరకు కళాకారులు ప్రతిరోజు పాల్గొని పాటలను, కళారూపాలను ప్రదర్శించారు. కళాకారులు జగన్, ఆర్ పిచ్చయ్య, లంక దుర్గారావు, కేవీ భాస్కరరావు, ఎస్కే నజీర్, అప్పన్న, శర్మ,బాషా, హనీఫ్ బాషా, ఆంజనేయులు, సూరిబాబు, చిన్నప్ప, ప్రసాద్, వడ్లమూడి పద్మ, పి పద్మ, సుదర్శన రాజుతో పాటు విజయవాడలో ఉన్న ఔత్సాహిక కళాకారులు మరి కొంతమంది మాట పాట కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలి రోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన మాట పాట కార్యక్రమాన్ని కళా పోషకులు గోళ్ల నారాయణరావు ప్రారంభించారు. కళాకారులు దాదాపు రెండు గంటల పాటు ఆట, పాట, మాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో రోజు కూడా కళాకారులు సామాజిక సమస్యలతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక అంశాలతో కూడుకున్న గేయాలతో సభికులలో స్ఫూర్తినింపారు. మూడవరోజు కార్యక్రమంలో సమాజంలో జూదం మూఢనమ్మకాలతో కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు నృత్య ప్రదర్శనల ద్వారా కళ్లకు కట్టినట్టు చూపించారు. నాల్గవ రోజు కళాకారులు పాటలు నృత్యాలతో పాటు స్కిట్లను ప్రదర్శించారు. నరేంద్ర మోదీ అధికారంలోకి రాక మునుపు ఇచ్చిన హామీలకు ఓట్లు వేసి గెలిపించిన తరువాత వాటిని తీర్చనందు వలన సామాన్యుడికి మూర్ఛరోగం వచ్చిందనే భావనతో కూడుకున్న స్కిట్లను కళాకారులు ప్రదర్శించారు. ఐదవ రోజు మహిళా నాయకులు అక్కినేని వనజ, రమాదేవి, పి పద్మ, వడ్లమూడి పద్మ పాల్గొని సందేశాలు ఇచ్చారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు లెనిన్ మహాశయుడు మహిళలకు ఇచ్చిన గౌరవం గురించి వివరించారు. ఆరవ రోజు సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ దివాకర్ బాబు హైకోర్టు న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. రిపబ్లిక్ డే సందర్భం కలిసి వచ్చినందువల్ల భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను సమస్యలను వివరించారు. చివరి రోజు ఏడవ రోజున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరగోపాల్ , వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్ , సాహిత్య విమర్శకులు కాత్యాయని విద్మహే, సాహితీవేత్త అల్లం రాజయ్య, సిహెచ్ బాబురావు, అక్కినేని చంద్రావు పాల్గొన్నారు. దేశంలో మారిన పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టుల ఐక్యత చాలా అవసరం అన్న భావాన్ని వ్యక్తం చేశారు. ప్రజా కళామండలి మహిళా కళాకారులు తమ అభినయంతో ఏజెన్సీ ప్రాంతాల్లో పాలకులు, పోలీసులు పెడుతున్న కష్టాల గురించి అభినయం చేస్తూ పాటలు పాడారు. ఈ కళారూపం ఎంతగానో ఆకట్టుకున్నది. ఏడు రోజులుగా కళాకారులు ఎంతో స్ఫూర్తిదాయకమైన పాటలను ఆలపించడం జరిగింది. కార్యక్రమానికి హాజరైన వారితో పాటు, లెనిన్ విగ్రహ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ఎంతగానో ఆలోచింపజేసే విధంగా ఆకట్టుకునే విధంగా కళాకారులు తమ ఆటపాట మాట కార్యక్రమాన్ని ఉత్తేజభరితంగా సాగించారు. వరుసగా ఏడు రోజులుపాటు ఆటపాట మాట కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించడంలో ప్రముఖ పాత్ర వహించిన కళాకారులకు చిరు సత్కారంతో వారోత్సవాలు ముగిశాయి. స్ఫూర్తిని కలిగించే విధంగా లెనిన్ శతవర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం అత్యంత అభినందించదగ్గ విషయమని అనేకమంది కొనియాడారు. చెప్పుకోవలసిన ప్రత్యేకత కూడా ఒకటి ఉంది వామపక్షాలు వాటి ప్రజా, కళా సంస్థలు సమ్మిళితమై వారం రోజులపాటు ఒకే వేదికను ఆసరా చేసుకొని కార్యక్రమాలు నిర్వహించడం ఐక్యతను చాటినట్లుందని ఆనందాన్ని వ్యక్తపరిచారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా నెలకి ఒకటి చొప్పున ఏడాది పొడవునా విగ్రహం వద్ద కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రయత్నించాలని అనేక మంది సూచించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు

మోదీ కలలు కంటున్నారు...

లోక్‌సభలో ప్రధాని ప్రసంగంపై విపక్షాలు

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై విపక్షాలు విరుచుకుపడ్డాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి 400కుపైగా స్థానాల్లో ఘన విజయం సాధిస్తుందని మోదీ ధీమా వ్యక్తం చేయడంపై మంగళవారం విమర్శలు గుప్పించాయి. 'మోదీ కలలు కంటున్నారు. ఏకంగా 400కు పైగా సీట్లు గెల్చుకుంటామని మోదీ చెప్పడం చూస్తుంటే మళ్లీ అధికారంలోకి వస్తామనే విశ్వాసం ఆయనకు లేదని అర్థమవుతోంది. బీజేపీ ప్రభుత్వం దేశ లౌకిక భావనను గాయపరిచింది. గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను గాలికొదిలేసి ద్రోహం చేసింది. మహిళలు, ఎస్సీ, ఎస్టీల కోసం ఏం చేసింది? రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఎందుకు ఇంతవరకు నెరవేర్చలేదు?. గత మే నెల నుంచి రావణకాష్టంగా రగిలిపోతున్న మణిపూర్‌లో మోదీ ఎందుకు ఇంతవరకు ఒక్కసారైనా పర్యటించలేదు?' అని సీపీఐ నేత వినయ్ విశ్వం నిలదీశారు. '400 లేదా 500 సీట్లు గెలుస్తామని కల కనే హక్కు మోదీకి ఉంది. కానీ వాస్తవం వేరు. వేరే వాళ్ల కలలకు తగ్గట్లు నడుచుకోవాలో, సొంత నిర్ణయాలు తీసుకోవాలో ప్రజలే నిర్ణయించుకుంటారు' అని సీపీఎం నేత జాన్ బ్రిటస్ చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ మాట్లాడుతూ 'ఇందిరా గాంధీ, నెహ్రూల పేర్లు ప్రస్తావించకుండా ప్రధాని ప్రసంగం అస్సలు ముగియదు. ఇందిరా గాంధీ, నెహ్రూల పేర్లు స్మరించుకుంటేగానీ మోదీకి ఎన్నికల్లో గిట్టుబాటు అవుతుంది' అని ఎద్దేవా చేశారు. 'బాధ్యతాయుతమైన ప్రధాని పదవిలో కూర్చున్నందుకైనా కాస్తంత గౌరవప్రదంగా మాట్లాడాలి. 400కు పైగా గెలుస్తామనడం చూస్తుంటే ఈవీఎంల విశ్వసనీయతపై అనుమానాలొస్తున్నాయి' అని మరో బీఎస్పీ బహిష్కృత ఎంపీ డానిష్ అలీ అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేత శశిథరూర్ మాట్లాడుతూ 'నెహ్రూ గతించి దాదాపు 60 ఏళ్లు గడుస్తున్నా మోదీ ఇంకా ఆయననే లక్ష్యంగా చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గురించి మోదీ ఇంతగా పట్టించుకుంటుంటే మాకే చాలా ఆశ్చర్యంగా ఉంది. మోదీ ఆయన ప్రసంగమంతా కాంగ్రెస్‌కే అంకితమిచ్చారు. మోదీ ఇంకా నెహ్రూ, ఇందిర గాంధీనే తిడుతున్నారు. ధరలు పెరిగిన తర్వాత వచ్చే ఎన్నికల్లో ప్రతిసారీ కాంగ్రెస్ గెలిచినట్లు చరిత్ర చెబుతోంది. ఇప్పుడు కూడా ధరలు పెరిగాయి!' అని కాంగ్రెస్ నేత శశిథరూర్ వ్యాఖ్యానించారు.

ఏపీలో ఎస్టీ, ఒడిశాలో ఎస్సీ, ఎస్టీ జాబితాల సవరణ

రాజ్యసభలో బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, ఒడిశాలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జాబితాను సవరించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులను మంగళవారం రాజ్య సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మధ్యాహ్నం 1 గంటలకు ప్రశ్నోత్త రాల సమయం ముగిసిన తర్వాత మూడు బిల్లులు - రాజ్యాంగం (షెడ్యూల్డ్ తెగలు) ఆర్డర్ (సవరణ) బిల్లు, 2024; రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు) ఆర్డర్ (సవరణ) బిల్లు 2024; నీరు (కాలుష్య నివారణ, నియంత్రణ) సవరణ బిల్లు 2024 పరిశీలన, ఆమోదం కోసం సభలో చేపట్టాల్సిన ఇతర అంశాలను తాత్కాలికంగా నిలిపివేయాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రతిపాదించిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఆ తర్వాత గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండా ఈ రెండు బిల్లుల పరిశీలన, ఆమోదం కోసం సభకు సమర్పించారు. ఇందులో ఒక బిల్లు ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ తెగల జాబితా సవరణకు సంబంధించింది కాగా... మరొకటి ఒడిశాలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జాబితాలో మరిన్ని వర్గాలను చేర్చడం ద్వారా సవరించడానికి సంబంధించినది. దీనిపై బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, బీజేడీ, ఏఐఏడీఎంకేల సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. టీఎంసీకి చెందిన శాంతాను సేన్ మాట్లాడుతూ... 'గిరిజన సమాజానికి చెందిన గౌరవనీయ రాష్ట్రపతిని ఈ కొత్త పార్లమెంటు భవనం లేదా అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం సంద ర్భంగా ఆహ్వానిం చలేదని గుర్తుకొచ్చినప్పుడు నాకు చాలా బాధ కలుగుతోంది. ఈ ప్రభుత్వం ఆదివాసీ వర్గాలను ఎలా గౌరవి స్తుందో ఇది ప్రతిబింబి స్తుంది' అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఎల్ హనుమంతయ్య మాట్లాడుతూ ప్రభుత్వం దేశవ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జాబితాను ఎందుకు పరిశీలించలేక పోయిందని ప్రశ్నించారు. ఈ సమస్య మళ్లీ మళ్లీ తలెత్తకుండా ఉండాలంటే... దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీల జాబితాను ఒకేసారి చేసినట్లయితే మనం ఈ బిల్లులను ఎప్పటికప్పుడు సవరించాల్సిన అవసరం ఉండదన్నారు. నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) సవరణ బిల్లు కూడా రాజ్యసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

ఆగని ఈడీ దూకుడు

- ఆప్ నేతల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు
- మోదీ సర్కారు బెదిరిస్తోంది: మంత్రి అతిశీ
- చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: ఈడీ



న్యూఢిల్లీ: ఆప్ నాయకులు, ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తులపై ఈడీ దూకుడు కొనసాగుతోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఎలాగైనా తన దారికి తెచ్చుకోవడానికి మోదీ సర్కారు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈడీకి సైతం కేజ్రీవాల్ లొంగక పోవడంతో...ముందుగా ఆయన పార్టీ నాయకులు, వ్యక్తిగత సహాయకులను లక్ష్యంగా చేసుకుంది. అందులో భాగంగా కేజ్రీవాల్ వ్యక్తి గత సహాయకుడు విభవ్ కుమార్, ఆ పార్టీ వ్యక్తుల ఇళ్లలో ఈడీ మంగళవారం సోదాలు నిర్వహిం చింది. ఢిల్లీ జలబోర్డు(డీజేబీ)లో అక్రమాల ఆరోపణలపై మనీలాండరింగ్ కేసుకు సంబం ధించి సోదాలు జరిగినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దేశ రాజధానిలోని 10-12 ప్రాంతాలలో ఈడీ అధికారులు తనిఖీలు చేసినట్లు తెలిపాయి. విభవ్‌కుమార్, ఢిల్లీ జలబోర్డు మాజీ సభ్యుడు శరభ్ కుమార్ ఇళ్లు, కార్యాలయాలు, ఆప్ రాజ్యసభ ఎంపీ, పార్టీ కోశాధికారి ఎన్‌డీ గుప్తా కార్యాలయంపై ఈడీ అధికారులు దాడి చేసినట్లు పేర్కొన్నాయి. ఢిల్లీ జలబోర్డుకు సంబంధించిన టెండర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఈ దాడులు జరి గాయి. ఇదే కేసులో రిటైర్డు మాజీ చీఫ్ ఇంజినీర్ జగదీశ్‌కుమార్ అరోరా, కాంట్రాక్టరు అనిత్ కుమార్ అగర్వాల్‌ను ఈడీ అధికారులు గతవారం అరెస్టు చేశారు. ఈడీపై ఢిల్లీమంత్రి అతిశీ తీవ్ర విమర్శలు చేసిన మరుసటిరోజే ఈ దాడులు జరగడం గమనార్హం. ఢిల్లీ మద్యం కుంభకోణం సహా అనేక కేసుల్లో సాక్షులు వాంగ్మూలాలను ఈడీ తొలగించిందని, ఆప్ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపునకు పాల్పడుతోందని మంత్రి అతిశీ నిన్న ఆరోపించారు.

ఆప్‌ను భయపెట్టే ప్రయత్నం: అతిశీ

తమ పార్టీ నాయకులపై ఈడీతో దాడులు చేయించడం ద్వారా తమను భయపెట్టడానికి, మాట్లాడకుండా చేయడానికి మోదీ సర్కారు ప్రయత్నిస్తోందని మంత్రి అతిశీ మంగళవారం ఆరోపించారు. విభవ్‌కుమార్, ఎంపీ ఎన్‌డీ గుప్తా నివాసాలు, కార్యాలయాలపై దాడులు అందులో భాగమేనని ఆమె అన్నారు. ఉదయం ఏడు గంటల నుంచే ఆప్ తనిఖీలు చేసిందని, ఇతర ఆప్ నేతల ఇళ్లలోనూ రోజంతా సోదాలు చేసినట్లు ఆమె విలేకరుల సమావేశంలో ఆరోపించారు. 'రేపు ఉదయం 10 గంటలకు ఈడీ బండారం బయటపెడతానని నేను నిన్ననే చెప్పాను. దీనిని బయటపెట్టకుండా చేయడానికి ఆప్‌ను బెదిరించడానికి ఈడీ సోదాలు చేసింది. రోజంతా తనిఖీలు కొనసాగాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకొని మమ్ములను బెదిరించడానికి కేంద్రం ప్రయత్నిస్తోంది' అని ఆమె చెప్పారు. మద్యం కుంభకోణం కేసులో తమ నేతలకు వ్యతిరేకంగా అవాస్తవ వాంగ్మూలాలు సేకరిస్తోందని, దర్యాప్తునకు సంబంధించిన సీసీటీవీ వీడియోలను కోర్టులో సమర్పించాలని ఈడీకి ఆమె సవాలు విసిరారు. రెండేళ్లుగా దర్యాప్తు జరుపుతున్నప్పటికీ... ఇంతవరకు తగిన ఆధారాన్ని గుర్తించలేదని విమర్శించారు. 'ఈడీ ఏం దాచిపెట్టాలని చూస్తోంది? ఇప్పటివరకు ఎన్ని వాంగ్మూలాలు సేకరించింది? ఎన్ని సీసీటీవీలో రికార్డు అయ్యాయి? ఏ వాంగ్మూలాలను ఆడియో రికార్డు చేసింది?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

మరోవైపు మనీలాండరింగ్ కేసు దర్యాప్తును ఉద్దేశించి ఆప్ నేతలు చేస్తోన్న ఆరోపణలను ఈడీ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఈడీపై నిరాధార ఆరోపణలపై చేసిన మంత్రి అతిశీపై పరువునష్టం దావా వేస్తామని అధికారులు హెచ్చరించారు. కేసు విచారణ సమయంలో వీడియో రికార్డు చేశామని, ఆ సమయంలో సీసీటీవీ సదుపాయం లేదని ఈడీ అధికారులు తెలిపారు.

'పీఎం-కిసాన్' సాయం పెంచం

కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: ఇటీవల పీఎం-కిసాన్ పథకం కింద లబ్ధిదారులకు చెల్లించాల్సిన మొత్తాన్ని పెంచనున్నారనే వార్తలు వచ్చిన నేపథ్యంలో వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా కీలక ప్రకటన చేశారు. పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు ఆర్థిక ప్రయోజ నాన్ని ఏడాదికి రూ.8వేల నుంచి 12 వేలకు పెంచే ప్రతిపా దనేదీ లేదని మంత్రి లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. అలాగే, ఈ పథకం కింద మహిళా రైతులకు కూడా పెంచే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్)ని కేంద్రం 2019లో ప్రారంభించింది. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు పెట్టుబడి సాయంగా ప్రతి ఏడాది రూ.6000 అందిస్తారు. వీటిని విడతల వారీగా ప్రతి నాలుగు నెలలకు రూ.2,000 చొప్పున మూడు విడతలుగా రైతుల ఖాతాలలో జమ చేస్తారు. మంత్రి లోక్‌సభలో పేర్కొన్న దాని ప్రకారం... ప్రభుత్వం ఇప్పటివరకు 15 విడతలుగా 11 కోట్ల మందికి పైగా రైతులకు రూ.2.81 లక్షల కోట్లకు పైగా పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే, ప్రపంచంలోని అతిపెద్ద డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకాల్లో ఇది ఒకటని, ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

కనీస మద్దతు ధరపై 37 సమావేశాలు

వ్యవసాయ శాఖ మాజీ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ నేతృత్వంలో కేంద్రం నియమించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణాయక కమిటీ ఇప్పటివరకు 37 సమావేశాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించిందని వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా లోక్‌సభకు వెల్లడించారు. మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలను ఉపసంహరించిన సందర్భంలో ఈ కమిటీ ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ తర్వాత ఎనిమిది నెలల తర్వాత, జూలై 2022లో కమిటీని ఏర్పాటు చేశారు. 'ఇప్పటి వరకు, కమిటీ ముప్పై ఏడు సమావేశాలు/వర్క్‌షాప్‌లు నిర్వహించింది' అని మంత్రి లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి మరింత ప్రభావవంతంగా, పారదర్శకంగా ఉండేలా కమిటీ సూచనలు చేయవలసి ఉంటుందని... మారుతున్న దేశ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంటల విధానాన్ని మార్చుకోవాలని ఆయన అన్నారు. కమిటీకి కేటాయించిన విషయాలపై చర్చించడానికి సమావేశాలు నిరంతరం జరుగుతున్నాయని ఆయన చెప్పుకొచ్చారు.

పెన్షన్ పథకంలో 23.38 లక్షలమంది రైతుల నమోదు

రైతుల పెన్షన్ పథకం పీఎంకేఎంవై కింద ఇప్పటివరకు 23.38 లక్షల మంది రైతులు నమోదు చేసుకున్నారని మంత్రి అర్జున్ ముండా తెలిపారు. సెప్టెంబర్ 2019లో ప్రారంభించబడిన ప్రధాన్ మంత్రి కిసాన్ మన్ధన్ యోజన (పీఎంకేఎంవై) పథకంలో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 23,38,720 మంది రైతులు నమోదు చేసుకున్నారని ముండా లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

కేంద్ర మంత్రి అనర్హుడు: డీఎంకే ఎంపీ

బీజేపీ సభ్యుల అభ్యంతరం

న్యూఢిల్లీ: కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ మంత్రిగా ఉండటానికి తగరని డీఎంకే ఎంపీ టీఆర్ బాలు చేసిన వ్యాఖ్యలు లోక్‌సభలో మంగళవారం తీవ్ర గందర గోళానికి దారితీశాయి. ఎంపీ వ్యాఖ్యలు దళిత వర్గాన్ని అవమానించేలా ఉన్నాయంటూ అధికార బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టంపై ప్రశ్నోత్తరాల సమయంలో చర్చ జరుగుతుండగా ఈ గందరగోళం చెలరేగింది. డీఎంకే ఎంపీలు ఎ.రాజా, ఎ.గణేశన్ ఈ అంశంపై మాట్లాడుతూ డిసెంబరులో భారీ వర్షాలు, వరదరతో చెన్నై, పరిసర ప్రాంతాలు బాగా దెబ్బతిన్నాయని, నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందాన్ని పంపించారా అని ప్రశ్నించారు. అదే జరిగితే సహాయ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఎన్ని నిధులు పంపారు? ఏవిధంగా ఆదుకున్నారో ఆ వివరాలను హోం వ్యవహారాల శాఖ మంత్రి తెలియజేయాలని కోరారు. ఇదే అంశంపై శ్రీపెరంబుదూరు ఎంపీ టీఆర్ బాలు మాట్లాడుతుండగా తమిళనాడుకే చెందిన బీజేపీ ఎంపీ ఎల్.మురుగన్ జోక్యం చేసుకున్నారు. దీంతో బాలు అసహనం వ్యక్తం చేస్తూ, జోక్యం చేసుకోవడానికి మీరెవరు? దయచేసి కూర్చోండి. మీరు పార్లమెంటు సభ్యుడిగా ఉండడానికి అనర్హులు, మంత్రిగా కూడా అనర్హులే అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, అర్జున్ రామ్ మేఘ్వాల్ అభ్యంతరం తెలిపారు. డీఎంకే ఎంపీ తన సహచరుడిని అసమర్థుడని అనడం సరికాదని అన్నారు. ఒక ఎస్సీ మంత్రి అసమర్థుడని ఎలా అంటారు? ఇది దళితులను అవమానించడమేనని జోషి అభ్యంతరం చెప్పారు. 'టీఆర్ బాలు ప్రశ్న వేశారు. మా దళిత మంత్రి తమ స్థానం నుంచి లేచి అసంబద్ధమైన ప్రశ్న అడిగారని చెప్పారు. దానికి మీరు ఆయనను అసమర్థుడని అన్నారు. ఆయన కూడా దళిత సామాజిక వర్గం ఎస్సీకి చెందిన వ్యక్తే. ఆయనను అనర్హుడు అని అనడం దళిత వర్గానికే అవమానం. బాలు క్షమాపణ చెప్పాలి' అని మేఘ్వాల్ డిమాండ్ చేశారు. అయితే, బాలు మాత్రం వెనక్కి తగ్గలేదు. మంత్రి రాజకీయాల్లో ఉండడానికి కూడా సరిపోరని వ్యాఖ్యానించారు. దీంతో జోషి కలగజేసుకుంటూ డీఎంపీ ఎంపీ మొత్తం ఎస్సీ సమాజాన్నే అవమానిస్తున్నారని తప్పుపట్టారు.

ఈవీఎంల గోల్‌మాల్‌లో ప్రధాని హస్తం

కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ పార్లమెంటులో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి మంగళవారం విమర్శలు గుప్పించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి 370 సీట్లు వస్తాయని ప్రధాని అంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారని ప్రశ్నించారు. అంత పక్కాగా చెప్పగలుగుతున్నారంటే ఈవీఎంల గోల్‌మాల్‌లో ప్రధాని హస్తం ఉన్నట్లు కనిపిస్తోందని అధిర్ అనుమానం వ్యక్తం చేశారు. 'ఇప్పటివరకు ఈవీఎంల గోల్‌మాల్‌పై మాకు కచ్చితమైన సమాచారం లేదు. కానీ వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఎన్ని సీట్లు వస్తాయో ప్రధాని అంత పక్కాగా చెప్పడం చూస్తుంటే ఈవీఎంలలో ఏవో రహస్యాలు దాగి ఉన్నాయనిపిస్తోంది. కాశ్మీర్‌కు సంబం ధించిన ఆర్టికల్ 370ని రద్దు చేసినం దువల్లే బీజేపీకి 370 సీట్లు వచ్చాయని వాళ్లు ప్రపంచానికి చూపించాలనుకుం టున్నారు. ఒక వ్యవస్థ తర్వాత మరొక వ్యవస్థను బీజేపీ కబ్జా చేసింది. ఈ దేశంలో ఎన్నికలను కూడా ఒక తమాషాలా తయారు చేశారన్న భావన కలుగుతోంది' అని అధిర్ అన్నారు.

విజయన్ పోరుకు పూర్తి మద్దతు: స్టాలిన్

చెన్నై: కేంద్రంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేస్తోన్న యుద్ధానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాజ్యాంగంలోని 293వ అధికారణ కింద తమ అధాకారాలు ఉపయోగించుకొని రాష్ట్రాల అప్పుల పరిమితిని కేంద్రం నియంత్రిస్తోందని స్టాలిన్ విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రాల అప్పులకు పరిమితి విధిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సమ్మతితోనే అప్పులు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ కేంద్రం మాత్రం అడుగడుగునా అడ్డుకుంటుందని, చట్టబద్ధంగా రాష్ట్రాలకు గల అవకాశాలను సైతం తొక్కి పెడుతోందని స్టాలిన్ అన్నారు. రాజ్యాంగ నిర్మాతలు కల్పించిన ద్రవ్య సమాఖ్య సూత్రాలకు భిన్నంగా మోదీ సర్కారు వ్యవహరిస్తోందని అన్నారు. ఈ మేరకు విజయన్‌కు స్టాలిన్ మంగళవారం లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ, వివక్షాపూరిత వైఖరిని ఎండగట్టేందుకు విజయన్ చేస్తున్న పోరాటం అభినందనీయమని, మోదీ సర్కారు చర్యలను సుప్రీంకోర్టు ముందుంచడం, ఇందుకు మీరు చేస్తున్న ప్రయత్నానికి అండగా ఉంటామని స్టాలిన్ పేర్కొన్నారు. సాధారణంగా ఇలాంటి పరిణామాలు కొన్నిసార్లు జరుగుతుంటాయని, అయితే గడిచిన కొన్నేళ్లుగా పరిస్థితులు మరింత దారుణంగా మారాయని, ఈ విషయంలో ప్రగతిశీల ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయం రావాల్సి ఉందని స్పష్టంచేశారు. ఏదిఏమైనా కేంద్ర ప్రభుత్వం 293 అధికరణను ఉపయోగించుకొని తన అధికారాలను దుర్వినియోగం చేస్తోందని స్టాలిన్ విమర్శించారు.

ఆప్ ఎంపీ ప్రమాణస్వీకారానికి రెండోసారి కోర్టు అనుమతి

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్ పార్లమెంటుకు వెళ్లి రాజ్యసభ ఎంపీగా ప్రమాణస్వీకారం చేయడానికి రౌస్ ఎవెన్యూ కోర్టు రెండోసారి అనుమతించింది. ఫిబ్రవరి 8 లేదా 9వ తేదీల్లో ఆయన పార్లమెంటుకు వెళ్లేందుకు ప్రత్యేక న్యాయమూర్తి ఎం.కె.నాగ్‌పాల్ మంగళవారం అనుమతించారు. జ్యుడిషియల్ కస్టడీ నుంచి సంజయ్ సింగ్‌ను తగిన భద్రతతో ప్రమాణస్వీకారానికి తీసుకువెళ్లాలని జైలు అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. రాజ్యసభ సెక్రటేరియట్‌కు తగిన సమాచారం ఇవ్వాలని కూడా జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలిచ్చారు. సంజయ్ సింగ్ ప్రమాణ స్వీకారానికి కోర్టు ఇంతకుమందు అనుమతించినప్పటికీ కొన్ని కారణాల రీత్యా ఆయన ప్రమాణస్వీకారం చేయలేకపోయిన విషయాన్ని కోర్టు పరిగణలోకి తీసుకుంది. ఫిబ్రవరి 8,9 తేదీల్లో ఆయనను తిరిగి రాజ్యసభకు తీసుకువెళ్లాలని కోర్టు స్పష్టం చేసింది. సంబంధిత డాక్యుమెంట్లపై సంజయ్ సింగ్‌ను కలుసుకుని సంతకాలు తీసుకునేందుకు ఆయన తరపు న్యాయవాదిని అనుమతిస్తున్నట్టు తెలిపింది. సింగ్ తరఫున న్యాయవాదులు రజత్ భరద్వాజ్, మొహమ్మద్ ఇర్షాద్ కోర్టు ముందు హాజరుకాగా, ఈడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నవీన్ కుమార్ మిత్రా హాజరయ్యారు. ఇదిలాఉండగా, ఫిబ్రవరి 5న రాజ్యసభ ఎంపీగా సంజయ్ సింగ్ ప్రమాణస్వీకారానికి కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే, బులిటెన్‌లో నోటిఫై చేసిన సభా కార్యక్రమాలను మాత్రమే సభలో చేపడతామని చెబుతూ రాజ్యసభ చైర్‌పర్సన్ జగదీప్ ధన్కర్ అభ్యంతరం తెలిపారు. రాజ్యసభకు ఎలాంటి సమాచారం లేదని, ప్రమాణస్వీకార అంశం పరిశీలనలోకి రాలేదని చెప్పారు. దీంతో సింగ్ ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గత ఏడాది అక్టోబరు 4న సంజయ్ సింగ్‌ను అరెస్టు చేసింది. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును గతవారం రిజర్వు చేసింది.

సిద్ధరామయ్యకు రూ.10 వేల జరిమానా

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఆ రాష్ట్ర హైకోర్టు జరిమానా విధించింది. 2022లో తనపై నమోదయిన ఓ కేసును కొట్టియాలని అభ్యర్థిస్తూ ఆయన వేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రోడ్లను దిగ్బంధించి ప్రయాణికులకు అసౌకర్యం కలిగించారంటూ నమోదయిన కేసులో సీఎం సిద్ధరామయ్యకు రూ.10 వేలు జరిమానా విధించింది. ఈ జాబితాలో కాంగ్రెస్ సీనియర్ నేత రణ్‌దీప్ సూర్జేవాలాతో పాటు మంత్రులు ఎంబీ పాటిల్, రామలింగారెడ్డి ఉన్నారు. అలాగే, మార్చి 6న ఎంపీ/ఎమ్మెల్యే ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుకావాలని ఆదేశించింది. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె.ఎస్.ఈశ్వరప్ప తన గ్రామంలో పనులకు 40 శాతం కమీషన్ డిమాండ్ చేశారని ఆరోపిస్తూ సంతోష్ పాటిల్ అనే కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో సీఎం రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. ఇందులో భాగంగా నాటి సీఎం బసవరాజ్ బొమ్మై నివాసాన్ని ముట్టడించేందుకు సిద్ధరామయ్యతో పాటు ఆ పార్టీ సీనియర్ నేతలు ప్రదర్శన చేపట్టగా... రోడ్లను దిగ్బంధించి ప్రయాణికులకు అసౌకర్యం కలిగించారంటూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలన్న సీఎం సిద్ధరామయ్య అభ్యర్థనను తోసిపుచ్చిన హైకోర్టు ప్రజాప్రతినిధులు కూడా నిబంధనలు పాటించాలని సూచించింది.

త్వరలో నటుడు విశాల్ రాజకీయ పార్టీ?

చెన్నై: ప్రముఖ నటుడు విశాల్ త్వరలో రాజకీయ రంగప్రవేశం ఇవ్వబోతున్నారంటూ తమిళనాట వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పార్టీ ఏర్పాటుకు గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా రాజకీయ ఎంట్రీ ఉండబోతోందని జోరుగా ప్రచారం జరుగుతోంది. విశాల్ పొలిటికల్ ఎంట్రీపై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని, అతి త్వరలోనే ఆయన తన పార్టీ పేరును కూడా ప్రకటించబోతున్నారని సమాచారం. కాగా తమిళనాడు రాజకీయాలపై విశాల్ చాలా ఏళ్లుగా ఆసక్తిగా ఉన్నారు. గతంలో చెన్నై ఆర్కే నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు విశాల్ నామినేషన్ కూడా వేశారు. అయితే, కొన్ని కారణాల రీత్యా ఆ నామినేషన్ తిరస్కరణకు గురైంది. విశాల్ ప్రస్తుతం 'విశాల్ పీపుల్స్ హెల్త్ మూమెంట్' పేరుతో ప్రజలకు సేవ చేస్తున్న విషయం తెలిసిందే. చెన్నైలో వరదలు, ఇతర విపత్తు సమయాల్లో ఆయన ప్రజలను ఆదుకుంటున్నారు.

'వందే భారత్' ఆహారంలో బొద్దింక

న్యూఢిల్లీ: రైళ్లలో అందించే ఆహార నాణ్యతపై ప్రయాణికుల నుంచి తరచూ అభ్యంతరాలు వస్తూనే ఉన్నాయి. అయితే ఎన్ని ఫిర్యాదులు అందినా మార్పు మాత్రం రావడం లేదు. ఇప్పుడు ప్రతిష్ఠాత్మక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సాధారణ రైళ్లలో కంటే వందేభారత్‌లో ధర ఎక్కువగా ఉన్నప్పటికీ ఆహారం మాత్రం సరిగా ఉండటం లేదని, పాచిపోయిన, పురుగులు పడిన ఆహారం వచ్చిందంటూ ప్రయాణికుల నుంచి ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి. తాజాగా అలాంటి ఘటనే మరొకటి చోటు చేసుకుంది. ఓ ప్రయాణికుడి ఫుడ్ ప్యాకెట్‌లో చచ్చిన బొద్దింక కనిపించింది. శుభేందు కేశరి అనే వ్యక్తి ఫిబ్రవరి 1న రాణి కమలపాటి నుంచి జబల్‌పూర్ జంక్షన్ వరకు వందేభారత్ రైల్లో ప్రయాణించాడు. ప్రయాణ సమయంలో ఫుడ్ ఆర్డర్ చేసుకున్నాడు. కాసేపటికి ఫుడ్ ప్యాకెట్ వచ్చింది. అయితే, అది తెరిచి చూడగా.. చచ్చిన బొద్దింక కనిపించింది. ఈ ఘటనతో ఒక్కసారిగా షాక్ అయిన అతడు... వెంటనే ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. తన ఆహారంలో బొద్దింక వచ్చిందంటూ రైల్వే శాఖకు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

మార్చి నుంచి వందేభారత్ స్లీపర్

న్యూఢిల్లీ: వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ రైళ్ల ట్రయల్ రన్ మార్చి నెల నుంచి చేపట్టనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఏప్రిల్‌లో ఈ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని, తొలి రైలును ఢిల్లీ-ముంబై మధ్య ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాజధాని ఎక్స్‌ప్రెస్ కంటే వేగంగా ప్రయాణించే ఈ రైలులో 16 నుంచి 20 (ఏసీ, నాన్-ఏసీ) కోచ్‌లు ఉంటాయి. వీటితో దేశంలోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందని రైల్వే అధికారులు తెలిపారు. 'రాత్రి వేళలో ఎక్కువ ప్రయాణదూరం ఉండే రూట్లలో వందేభారత్ స్లీపర్ రైళ్లను నడపాలని నిర్ణయించాం. వీటిని చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో డిజైన్ చేశారు. ఇప్పటి వరకు భారతీయ రైల్వేలో ఉన్న సర్వీస్‌ల కంటే ఇవి వేగంగా ప్రయాణిస్తాయి. దీంతో ప్రయాణ సమయం రెండు గంటలు ఆదా అవుతుంది. తొలి దశలో పది రూట్లలో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని భారతీయ రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే సెమీ హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఛైర్‌కార్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య సర్వీస్‌లను అందిస్తున్నాయి. త్వరలో వందే మెట్రో రైలును కూడా తీసుకురానున్నట్లు సమాచారం.

రూ.కోట్లలో ప్రజాధనం దుర్వినియోగం

- బీజేపీ కోసం అసోం సీఎం హిమంత విశ్వశర్మ నిర్వాకం
- విచ్చలవిడిగా అద్దె విమానాలు, హెలికాప్టర్ల వినియోగం
- ఆర్‌టీఐ దరఖాస్తు ద్వారా బట్టబయలు

గుహవతి/న్యూఢిల్లీ: అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ అధికార దుర్వినియోగానికి పాల్పడిన విషయం సాక్ష్యాధారాలతో సహా వెల్లడైంది. అసోం రాష్ట్రపరిధిలో, రాష్ట్రం వెలుపల బీజేపీ కోసం ప్రచారం చేయడానికి హెలికాప్టర్లు, చార్టర్డ్ విమానాలను అద్దెకు తీసుకోవడానికి ఆయన కోట్ల రూపాయల రాష్ట్ర ప్రభుత్వ నిధులను ఉపయోగించారు. స్వయానా అసోం ప్రభుత్వ అధికారులే సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద దాఖలు చేసిన అర్జీలకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించారు. ఇది పూర్తిగా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుంది. ఆగస్టు 26, 2022న స్వచ్ఛంద వార్తా సంస్థ 'ది క్రాస్‌కరెంట్' దాఖలు చేసిన అర్జీల ద్వారా సీఎం హిమంత శర్మ... పార్టీ సమావేశాలకు కాకుండా అనేక వివాహాలకు హాజరు కావడానికి కూడా పన్ను చెల్లింపుదారుల డబ్బుతో చార్టర్డ్ విమానాలను అద్దెకు తీసుకున్నట్లు వెల్లడైంది. అనధికారిక పనులకు ప్రభుత్వ నిధులను ఖర్చు చేయకూడదు. అనధికారిక కార్యకలాపాల్లో సహజంగా పార్టీ సంబంధిత కార్యకలాపాలు, ప్రైవేట్ పార్టీలకు హాజరు కావడం వంటివి ఉంటాయి - వీటిలో దేనికీ ప్రజాధనం నుంచి చెల్లింపులు జరపరాదు. ప్రభుత్వ కార్యక్రమాల నిమిత్తమే చార్టర్డ్ విమానాలను అద్దెకు తీసుకున్నామని సెప్టెంబరులో, శర్మ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో పేర్కొంది.

ఆగస్టు 2022లో దాఖలు చేసిన ఆర్‌టీఐ దరఖాస్తుపై తొలుత రాష్ట్ర సాధారణ పరిపాలనా విభాగం స్పందించలేదు. ది క్రాస్‌కరెంట్ విజ్ఞప్తికి రాష్ట్ర సమాచార కమిషన్ స్పందించిన తర్వాత మాత్రమే సెప్టెంబర్ 30, 2023న డిపార్ట్‌మెంట్ అండర్ సెక్రటరీ, రాష్ట్ర పౌరసమాచారశాఖ అధికారి అయిన ప్రదీప్ శర్మ... కొంత సమాచారాన్ని పంచుకున్నారు. అదనంగా, విలేకరులు అసోం పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏటీడీసీ)కు ప్రత్యేక ఆర్‌టీఐ అభ్యర్థనను దాఖలు చేశారు. మూడు నెలలు గడుస్తున్నా ఏటీడీసీ ఇంకా ఎటువంటి సమాధానం చెప్పలేదు. ఇది ఆర్టీఐ చట్టం 2005ని ఉల్లంఘిస్తోంది. చట్ట ప్రకారం మొదటి అప్పీలేట్ అథారిటీగా నియమించబడిన అధికారులు 30 రోజులలోపు ఆర్‌టీఐ ప్రశ్నకు సమాధానం ఇవ్వాలి.

ఎన్నికల నియమావళికి విరుద్ధం

ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళిలోని క్లాజ్ 7 (ఎ) ప్రకారం మంత్రులు తమ అధికారిక పర్యటనను ఎన్నికల ప్రచార పనులతో కలపకూడదు. ఎన్నికల కోసం అధికారిక యంత్రాంగాన్ని లేదా సిబ్బందిని కూడా ఉపయోగించకూడదు. కాగా అధికారిక విమానాలు, వాహనాలు, యంత్రాలు , సిబ్బందితో సహా ప్రభుత్వ రవాణాను అధికారంలో ఉన్న పార్టీ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని క్లాజ్ 7 (బి) స్పష్టంగా పేర్కొంది. ప్రభుత్వం కొంతమేర మాత్రమే సమాచారం అందించినప్పటికీ ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తన పార్టీ, మిత్రపక్షాల అభ్యర్థుల కోసం ప్రచారం చేయడానికి అసోం ప్రభుత్వ నిధులతో హెలికాప్టర్‌లను ఉపయోగించడం ద్వారా కనీసం ఐదుసార్లు ఎన్నికల నిబంధనల్ని ఉల్లంఘించారని తేలింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఫొటోలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం.

లక్నో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్‌ను పరామర్శిస్తున్న సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మమతాజీ 'ఇండియా'లో భాగమే: రాహుల్

గుమ్లా: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి సంబంధించి ఇండియా కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకంపై చర్చలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. గుమ్లా జిల్లాలోని బసియాలో భారత్ జోడో న్యాయ యాత్ర సందర్భంగా రాహుల్ మీడియాతో మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత మమతా బెనర్జీ ఇండియా కూటమిలో ఉన్నారా అన్న ప్రశ్నకు బదులిస్తూ... 'ఇండియా కూటమిలోని ఇతర పక్షాల మాదిరిగానే మమతాజీ కూడా భాగం' అని ఆయన అన్నారు. సీట్ల పంపకంపై కూటమి పక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయని... అది సాధారణ విషయమేనని ఆయన తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని తమ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయదని మమతా బెనర్జీ గత వారం చెప్పారు. ఎన్నికల్లో బీజేపీకి సహకరించేందుకు సీపీఎంతో కాంగ్రెస్ చేతులు కలిపిందని ఆమె ఆరోపించిన సంగతి విదితమే. అయితే రాహుల్ మాత్రం మమత ఇండియా కూటమిలోనే ఉన్నారన్నారు. బీహార్ సీఎం నితీశ్ కుమార్ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో చేరడంపై రాహుల్ మాట్లాడుతూ 'ఆయన వైదొలగడానికి కారణాలు ఏమిటో మీరు ఊహించవచ్చు. ఇండియా కూటమిలో భాగంగా బీహార్‌లో పోరాడతాం' అని చెప్పారు.

ఇంధన రంగంలో 67 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

ప్రధాని మోదీ

గోవా: వచ్చే 5 నుంచి 6 సంవత్సరాలలో భారత ఇంధన రంగంలోకి 67 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. భారత ఇంధనరంగ వృద్ధిలో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆహ్వానించినట్లు చెప్పారు. భారత ఇంధన వారోత్సవాలను మంగళవారం ప్రారంభిస్తూ... భారత ఆర్థిక వ్యవస్థ 7.5 శాతం వార్షిక వృద్ధి రేటుతో దూసుకెళుతోందని మోదీ అన్నారు. త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇంతకుముందెన్నడూ లేని స్థాయిలో ఇంధన రంగంలో భారత్ పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోందని వెల్లడించారు. 2045 నాటికి దేశ ఇంధన అవసరాలు రెట్టింపవుతాయన్నారు. ప్రపంచంలో భారత్ మూడో అతిపెద్ద ముడిచమురు, ఎల్‌పీజీ వినియోగదారు అని గుర్తుచేశారు. అలాగే ఎల్ఎన్‌జీ వినియోగంలో నాలుగో స్థానంలో ఉందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ.. భారత్ మాత్రం దాన్ని సమర్థంగా ఎదుర్కోగలిగిందని మోదీ అన్నారు. పైగా గత రెండేళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించినట్లు చెప్పుకొచ్చారు. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్ల దేశీయ సహజవాయువు ఉత్పత్తి పెరుగుతోందన్నారు. భారత ఇంధన వినియోగంలో గ్యాస్ వాటాను 2030 నాటికి 15 శాతానికి పెంచుతామన్నారు. గత పదేళ్లలో పెట్రోల్‌లో ఇథనాల్ వాటాను 1.5 నుంచి 12 శాతానికి పెంచామన్నారు. 2025 నాటికి దాన్ని 20 శాతానికి చేర్చుతామని తెలిపారు. ప్రపంచ ఉద్గారాల్లో భారత్ వాటా నాలుగు శాతమేనని, 2070 నాటికి శూన్య ఉద్గారాల స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు గుర్తు చేశారు. ఇటీవల ప్రకటించిన సూర్యోదయ యోజనలో భాగంగా ఇళ్లల్లో అదనంగా ఉత్పత్తయ్యే విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని మోదీ ప్రకటించారు.

బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

11 మంది దుర్మరణం, 200మందికి గాయాలు

మధ్యప్రదేశ్‌లో ఘటన

హర్దా: మధ్యప్రదేశ్‌లోని బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందగా, దాదాపుగా 200 మంది గాయపడ్డారు. ఇందులో కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది. మరికొంత మంది కర్మాగారంలో చిక్కుకొని ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఇండోర్, భోపాల్ నుంచి ఐదు అగ్నిమాపక యంత్రాలు, సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని గంటల తరబడి శ్రమించి మంటలను అదుపుచేశాయి. ఈ ఘటన హర్దా జిల్లా బైరఘర్ పట్టణంలోని మగర్ధ రోడ్డులో అక్రమంగా నిర్వహిస్తున్న బాణసంచా ఫ్యాక్టరీలో మంగళవారం ఉదయం 11:30 గంటల సమయంలో జరిగింది. పేలుడు అనంతరం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి చుట్టుపక్కల ఉన్న ఇళ్లు, దుకాణాల కిటికీల అద్దాలు కూడా పగిలిపోయాయని స్థానికులు తెలిపారు. అలాగే పేలుడు తీవ్రతకు పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు వెల్లడించారు. మంటలు చుట్టుపక్కల ఉన్న భవనాలకు కూడా విస్తరించడంతో అక్కడున్న రోడ్లపై పరుగులు తీశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని హర్దా జిల్లా కలెక్టర్ రిషి గార్గ్ తెలిపారు. 'ఈ ప్రమాదంలో గాయపడిన వారిని హర్దా జిల్లా ఆసుపత్రికి తరలించాం. తీవ్రగాయాలైన వారిని మెరుగైన చికిత్స కోసం భోపాల్, ఇండోర్‌లకు తరలించేదుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సమీప జిల్లా నుంచి అంబులెన్స్‌లు, వైద్యులు, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ఘటనా స్థలానికి పిలిపించాం' అని కలెక్టర్ రిషి గార్గ్ తెలిపారు. బాణసంచా పేలుడు ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. అగ్నిప్రమాద బాధితులకు చికిత్స అందించేందుకు ఇండోర్, భోపాల్‌లోని ఆస్పత్రులతో పాటు ఎయిమ్స్‌లో ఏర్పాట్లు చేయాలని సూచించారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 'ఘటనాస్థలికి 50 అంబులెన్స్‌లను పంపారు. మంత్రి ఉదయ్‌ప్రతాప్ సింగ్, హోంగార్డ్ డీజీ అరవింద్‌తో పాటు 400 మంది పోలీసు అధికారులు అక్కడి వెళ్లారు. మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తాం. క్షతగాత్రులకు ఉచితంగా చికిత్స అందిస్తాం' అని సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు.

ప్రధాని సంతాపం

ఈ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. మృతులకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాని అన్నారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు.

పోటీ పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట

నియంత్రించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిర్వహించే పరీక్షల్లో జరిగే అక్రమాలను అడ్డుకునేందుకు వీలుగా రూపొందించిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు-2024'కు మంగళవారం లోక్‌సభలో ఆమోదం లభించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీన్ని సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ప్రతిభావంతులైన విద్యార్థులు, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ఉద్దేశించిన బిల్లుగా దీన్ని పేర్కొన్నారు.

లీకేజీకి పాల్పడితే భారీ శిక్ష

ఈ బిల్లుకు సంబంధించి విపక్ష సభ్యులు ప్రతిపాదించిన కొన్ని సవరణలు తిరస్కరణకు గురయ్యాయి. అనంతరం లోక్‌సభ దీన్ని ఆమోదించింది. ఇది అమల్లోకి వస్తే పేపరు లీకేజీకి పాల్పడినా, మాల్ ప్రాక్టీస్ చేసినా, నకిలీ వెబ్‌సైట్లను సృష్టించినా.. గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకూ జరిమానా పడనుంది. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, ఎన్‌డీఏ వంటి పోటీ పరీక్షలతోపాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి ప్రవేశపరీక్షలకూ వర్తిస్తుంది.

అరెస్టయిన లష్కరే ఉగ్రవాది రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి

న్యూఢిల్లీ: ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ఆదివారం అరెస్టయిన లష్కరే ఉగ్రసంస్థ సభ్యుడు రియాజ్ అహ్మద్‌ను రిటైర్డ్ సైనికోద్యోగిగా గుర్తించారు. జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఎల్ఈటీ మాడ్యూల్‌ను కశ్మీర్ పోలీసులు భగ్నం చేసిన కొద్దిరోజుల అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది. రియాజ్ అహ్మద్ వాస్తవాధీన రేఖ వెంబడి నుంచి ఆయుధాలను సేకరించేందుకు ఖుర్షీద్ అహ్మద్, గులాం సర్వర్‌తో కలిసి భారీ కుట్రకు తెరలేపాడని పోలీసులు తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో విధ్వంసం సృష్టించేందుకు ఆయుధాలను సేకరించే క్రమంలో వీరు కుట్ర పన్నారని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని కుప్వాడా జిల్లాలో దాడుల కుట్రను ఇటీవలే భద్రతా దళాలు భగ్నం చేశాయి.

నేటినుంచి షర్మిల జిల్లాల పర్యటనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ నెల 7 నుంచి 11 వరకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లాలలో పర్యటించనున్నారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం బాపట్ల నియోజక వర్గంలో బహిరంగ సభలో షర్మిల పాల్గొంటారు. 8వ తేదీ ఉదయం 10 గంటలకు తెనాలిలో రచ్చబండ నిర్వహి స్తారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు దెందులూరు నియోజక వర్గంలో బహిరంగ సభకు విచ్చేస్తారు. ఈ నెల 9న ఉదయం 10 గంటలకు కొవ్వూరు నియోజక వర్గంలో రచ్చబండలోను, సాయంత్రం 5 గంటలకు తుని నియోజక వర్గ బహిరంగ సభలోను పాల్గొంటారు. 10వ తేదీ ఉదయం నర్సీపట్నం నియోజక వర్గంలో రచ్చబండ, సాయంత్రం 5 గంటలకు పాడేరు నియోజక వర్గ బహిరంగ సభలకు హాజరవుతారు. ఈ నెల 11 న సాయంత్రం 5 గంటలకు నగరి నియోజక వర్గ బహిరంగ సభలో ఆమె పాల్గొంటారు.

జమ్మూకశ్మీర్ స్థానిక సంస్థల్లో ఓబీసీ కోటా బిల్లుకు లోక్‌సభ ఆమోదం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని స్థానిక సంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) రిజర్వేషన్ కల్పించే బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. 2019లో 370వ అధికరణను రద్దు చేసినప్పటి నుంచి కేంద్ర పాలిత ప్రాంతంలో కీలక మార్పులు చేపట్టినట్టు ప్రభుత్వం చెప్పింది. జమ్మూకశ్మీర్ స్థానిక సంస్థల చట్టం (సవరణ) బిల్లు-2024పై చర్చకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానమిస్తూ, నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల ఫలితాలు కేంద్రపాలిత ప్రాంత ప్రజలు చవిచూస్తున్నారని చెప్పారు.

జగన్‌కి ఓటమి భయం

ఎర్రచందనం,ఇసుక దొంగలను తరిమికొడతాం

జీడీ నెల్లూరు బహిరంగ సభలో చంద్రబాబు

విశాలాంధ్ర- వెదురుకుప్పం: ముఖ్యమంత్రి జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, దీంతో తీవ్ర మానసిక వేదనలో ఉన్నారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం రామానాయుడుపల్లి వద్ద మంగళవారం జరిగిన రా...కదలిరా...బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. సభకు చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. చంద్రబాబు మాట్లాడుతూ రాష్టంలో సైకో పాలనకు చరమగీతం పాడటానికి టీడీపీ-జనసేన సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. తాను చిత్తూరు జిల్లాలోనే పుట్టానని, ఎవరికీ భయపడేది లేదని ఎర్రచందనం, ఇసుకదొంగలను హెచ్చరించారు. ఆ దొంగలు రెండు నెలల్లో రాష్ట్రం వదిలి పారిపోవడం ఖాయమన్నారు. ఎడ్లబండ్ల కాలం నుంచి డ్రైవర్లు లేని కార్లు రావడం, కరెంటు లేని పరిస్థితి నుంచి ఎండతో కరెంటు ఉత్పత్తి చేసే వరకు తనకు అనుభవం, ముందు చూపు ఉందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు కొత్తగా రాకపోగా...ఉన్న పరిశ్రమలు పారిపోతుండటం దురదృష్టకరమని చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లాలో అమరరాజా పరిశ్రమపై జగన్‌మోహన్ రెడ్డి కక్ష కట్టి తరిమేశారని గుర్తు చేశారు. పుంగనూరులో పాపాల పెద్దిరెడ్డి పనైపోయిందని, అక్కడ ప్రజలు ఆయన అరాచకాలను గమనిస్తున్నారని చెప్పారు. ఉమ్మడి మేనిఫెస్టోతో జనసేన, టీడీపీ త్వరలో ప్రజల ముందుకు వస్తుందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జనరంజక పాలన అందిస్తామన్నారు. చంద్రబాబు సమక్షంలో మాజీ ఎమ్మెల్యే గాంధీ పార్టీ కండువా కప్పుకున్నారు. నియోజకవర్గ పరిధిలో చాలామంది ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, జీడీ నెల్లూరు ఇన్‌చార్జి థామస్, జనసేన నియోజకవర్గ బాధ్యుడు పొన్నా యుగంధర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీమంత్రి అమరనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీ మోహన్, గౌనివాని శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు స్వామిదాస్, నియోజకవర్గ యువత అధ్యక్షుడు గురుసాల కిషన్ చందు పాల్గొన్నారు.

రహదారుల మృత్యుఘోష

- భయపెడుతున్న రోడ్డు ప్రమాదాలు
- భారత్‌లో రోజుకు 480 మంది మృత్యువాత
- అతి వేగమే ప్రాణం తీస్తోంది
- నానాటికీ పెరుగుతున్న మృతులు
- రక్షణ కవచాలు లేకుండానే డ్రైవింగ్

ఎక్కడ చూసినా రోడ్డు ప్రమాదాలు.. ఏమూలకెళ్లినా రహదారులు రక్తసిక్తం.. మరణ మృదంగాలు..హాహాకారాలు.. ఆర్తనాదాలు. బయటకు వెళ్లిన బిడ్డలు క్షేమంగా తిరిగి ఇంటికి చేరేవరకు తల్లిదండ్రుల ఆందోళన. ఇవి కేవలం ఏ ప్రాంతానికో, రాష్ట్రానికో, దేశానికో పరిమితం కాదు.. ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్న భయానక దృశ్యాలు. పరిమితికి మించిన వేగం వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు, ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాహనదారుల తీరు మారడం లేదు. ప్రమాదాలు ఎప్పుడు ముంచుకొస్తాయో తెలియదుగనుక కనీసం రక్షణ కవచాలు ధరించండని మేలుకోరి చెప్పినా పెడచెవిన పెడుతున్నారు. ప్రమాదాలు కొనితెచ్చుకుని కుటుంబాలకు శోకాన్ని మిగులుస్తున్నారు.

విశాలాంధ్ర, డిజిటల్: పరిమితికి మించిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, అనుభవలేమి, రాంగ్‌రూట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. రహదారులు రక్తసిక్త మౌతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం భారత్‌లో ప్రతి మూడు నిమిషాలకు ఒకరు చొప్పున రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడుతున్నారు. రోజుకు సుమారు 480 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో దక్షిణ భారతదేశంలో తమిళనాడు మొదటిస్థానాన్ని, ఉత్తరభారతంలో మధ్యప్రదేశ్ రెండో స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల 85 శాతం, నిర్లక్ష్యపు డ్రైవ్ వల్ల 27 శాతం, రాంగ్‌రూట్ వెళ్లడంతో 85 శాతం మంది తిరిగిరాని లోకాలకు చేరుకుంటున్నారు. ప్రమాదకరంగా ఉన్న రహదారులే అధికంగా ప్రాణాలను బలితీసుకుంటున్నాయని అధికారులే చెబుతున్నారు. తెలంగాణలో 2013-2014 నుంచి 2021-22 మధ్య దశాబ్దకాలంలో సుమారు లక్షా 85 వేల ప్రమాదాలు జరగ్గా 61 వేల మందికి పైగా మృతి చెందగా...ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు లక్షా 82 వేల ప్రమాదాలు జరగ్గా 70 వేల మందికి పైగా తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. ఏపీ రోడ్ సేఫ్టీ కౌన్సిల్ మరణాల సంఖ్యను 15 శాతం తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించగా... వాస్తవానికి మరణాల సంఖ్య 25.37 శాతం పెరిగాయి. రోడ్డు భద్రతా మండలి సభ్యులు.. అతివేగం ప్రమాదానికి మొదటి కారణం కాగా, అధ్వానంగా ఉన్న రహదారుల వల్ల ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. 2021లో జరిగిన ప్రమాదాల్లో 8,053 మంది మృతి చెందగా 2020తో పోలిస్తే ప్రమాదాల సంఖ్య 10.16 శాతం, మరణాల సంఖ్య 14.08 శాతం పెరిగింది. కోవిడ్ కాలంలో ఆంక్షల వల్ల వాహనాల రాకపోకలు తగ్గినా ప్రమాదాలు మాత్రం ఆగలేదు. సుప్రీంకోర్టు కమిటీ సూచన మేరకు రాష్ట్రస్థాయిలో రోడ్డు భద్రతపై నామమాత్రపు ఏజెన్సీని ఏర్పాటు చేసినా అవసరమైన సిబ్బందిని కేటాయించకపోవడంతో ప్రమాదాలను అరికట్టలేకపోయారు. జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసి ఏజెన్సీల వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ఏపీలో జాతీయ రహదారులపై 350కి పైగా బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. రాష్ట్ర రహదారుల్లో 1,200 బ్లాక్‌స్పాట్‌లు గుర్తించినా ప్రమాదాలు అరికట్టడానికి సరిపడా సిబ్బంది లేకపోవడంతో ప్రమాదాలు నివారణలో వెనుకబడినట్టు అధికారులే చెప్పడం గమనార్హం. ద్విచక్రవాహనాల ప్రమాదాలే అధికమని వెల్లడించారు. ఫోర్‌వీలర్ల ప్రమాదాలు తెల్లవారుజామున రెండు నుంచి నాలుగు గంటల నడుమ జరుగుతున్నాయని, నిద్రలేమి కారణమని చెబుతున్నారు.

కర్నూలులో అవయవదానం విజయవంతం

బ్రెయిన్ డెడ్ అయిన మహిళ నుంచి సేకరణ

విశాలాంధ్ర- కర్నూలు వైద్యం: కర్నూలు ప్రభుత్వాస్పత్రి చరిత్రలో మొట్టమొదటిసారిగా బ్రెయిన్ డెడ్ అయిన మహిళ నుంచి అవయవదానం ఆపరేషన్ విజయవంతమైంది. నగరానికి చెందిన పావని లత అనే మహిళకు బ్రెయిన్ డెడ్ అయ్యింది. కుటుంబ సభ్యుల అనుమతితో పావని లత కళ్లను, కిడ్నీలను, కాలేయం, ఊపిరితిత్తులను వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ ఆపరేషన్ విజయవంతం కావడానికి సహాయసహకారాలు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆపరేషన్ విజయవంతం కావడానికి కృషి చేసిన ఆస్పత్రి సిబ్బందికి, పోలీసు శాఖ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ వెంకట రంగారెడ్డి, గుండె వైద్య నిపుణులు డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డిని అభినందించారు. డాక్టర్ వెంకట రంగారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆపరేషన్లు బెంగళూరు, హైదరాబాద్ నగరాలలో మాత్రమే జరుగుతుంటాయని, అయితే ఎంతో ప్రయాసతో కూడిన ఇలాంటి కష్టతరమైన శస్త్ర చికిత్సను కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించడం మొట్టమొదటిసారని తెలిపారు. కళ్లను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి, కిడ్నీలను కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌కు, కాలేయం, ఊపిరితిత్తులను విజయవాడ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. వరల్డ్ ఆర్గాన్ డొనేషన్ నియమ నిబంధనల ప్రకారం బ్రెయిన్ డెడ్ అయిన బాధితుల కుటుంబ సభ్యుల అనుమతి ఉండాలన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన పావని లత (28) కుటుంబ సభ్యులు కర్నూలు నగరంలోని బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్నారని, ఆమె తల్లిదండ్రులు కె.వి.ప్రతాపరెడ్డి సువర్ణమ్మ అని వివరించారు. లత భర్త కూడా రెండు సంవత్సరాల క్రితం కిడ్నీ వ్యాధితో మరణించారని, ఆమెకు జ్యోత్స్న (6) వయసు గల పాప కూడా ఉందని వివరించారు. ఈ సందర్భంగా అవయవదాత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ అవయవ దానం తమ కుమార్తె ఆలోచన అని, ఎందుకంటే రెండు సంవత్సరాల క్రితం ఆమె భర్త కిడ్నీ వ్యాధితో చనిపోయారని తెలిపారు. తమ కుమార్తె ఆలోచన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివ బాల నాగాంజన్, ప్రముఖ వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.